MAHANAGAR DINAPATRIKA

మహానగర్

విజయవాడ | సంపుటి : 10 | సంచిక : 285 | పేజీలు : 8 | ఆదివారం 4 అక్టోబర్ 2026 | వెల : 6-00



ఆంధ్రప్రదేశ్‌కు

ఐఐటీయన్ల మేధస్సు



- అమరావతిలో పాన్ ఐఐటీ వరల్డ్ కౌన్సిల్
- డీప్‌టెక్ స్టార్టప్‌ల కోసం రూ.500 కోట్ల పాన్ ఐఐటీ వెంచర్ ఫండ్
- 100 మంది గ్లోబల్ ఐఐటీ మెంటర్లతో నెట్‌వర్క్
- 23 ఐఐటీల సాంకేతికతను ఏపీకి బదిలీ చేసేందుకు అంగీకారం
- క్యూ-శివ పేరుతో ఐదు క్వాంటం కంప్యూటర్లను ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు

విజయవాడ, మహానగర్

ఆంధ్రప్రదేశ్‌ను గ్లోబల్ నాలెడ్జ్, డీప్‌టెక్, క్వాంటం టెక్నాలజీ హబ్‌గా అభివృద్ధి చేసేందుకు దేశంలోని 23 ఐఐటీల మేధస్సు, సాంకేతిక పరిజ్ఞానాన్ని రాష్ట్రానికి అనుసంధానం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాలను సాధించడంతో పాటు దేశాభివృద్ధిలో ఐఐటీయన్లు కీలక పాత్ర పోషించాలని ఆయన అన్నారు. నగరంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళావేదికలో శనివారం జరిగిన పాన్ ఐఐటీ ఏపీ సమ్మిట్-2026లో పాల్గొన్న సీఎం.. అమరావతి కేంద్రంగా పాన్ ఐఐటీ వరల్డ్ కౌన్సిల్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఐఐటీ పూర్వ విద్యార్థులు, విద్యావేత్తలు, పరిశ్రమలు, స్టార్టప్‌లు, పరిశోధనా సంస్థలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి రాష్ట్ర అభివృద్ధికి వారి నైపుణ్యాలను వినియోగించుకునేలా కౌన్సిల్ పనిచేయనుంది. డీప్‌టెక్ స్టార్టప్‌లు, ఆవిష్కరణలు, కొత్త టెక్నాలజీలకు పెట్టుబడులు అందించేందుకు రూ.500 కోట్ల పాన్ ఐఐటీ అమరావతి వెంచర్ ఫండ్ ఏర్పాటు చేయనున్నట్లు సీఎం వెల్లడించారు. దేశంలోని 23 ఐఐటీల నుంచి వచ్చిన సుమారు ఐదు లక్షల మంది ఐఐటీయన్ల మేధస్సును ఏపీ అభివృద్ధికి అనుసంధానం చేసేలా ఈ నెట్‌వర్క్‌ను రూపొందించనున్నట్లు తెలిపారు. సదస్సులో భాగంగా క్యూబిట్ ఫోర్స్ రూపొందించిన 'క్యూ-శివ' పేరుతో ఐదు క్వాంటం కంప్యూటర్లను చంద్రబాబు ఆవిష్కరించారు. ఇవి మినీ టెస్టింగ్ క్వాంటం కంప్యూటర్ ల్యాబ్‌లుగా ఉపయోగపడనున్నాయని తెలిపారు. 4 కెల్విన్ ప్రాసెసర్ సృష్టిని కూడా - మిగతా 2లో



రైతులకు బాబు లక్ష మోసాలు

- చంద్రబాబుపై మాజీ సీఎం వైఎస్ జగన్ మండిపాటు
- రూ.లక్ష కోట్లంటూ పిట్టలదొర మాటలు.. డ్రామాలు.. అంకెల గారడీలు
- హార్టికల్చర్ సహా పంటలకు ధరల్లేక రైతులు రోడ్డున పడితే.. రోజూ ధర్నాలు చేస్తే ఏరోజైనా పట్టించుకున్నారా?
- వేలాది ఎకరాల్లో తోటలు ఎండిపోతుంటే వాటర్ మ్యాన్ అని బిల్డప్‌లా?

2

పేదల కోసం మరో 3 లక్షల ఇళ్ల

నిర్మాణానికి శ్రీకారం

- కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్‌తో కలిసి శంకుస్థాపన చేయనున్న సీఎం చంద్రబాబు
- దేశంలోనే తొలిసారిగా 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ ఇళ్ల ప్రాజెక్టుకు భూమిపూజ
- గుంటూరు జిల్లా తెనాలి నియోజకవర్గంలో రేపు ఈ కార్యక్రమం
- గత 28 నెలల్లో ప్రభుత్వం 5.50 లక్షల ఇళ్లను లబ్ధిదారులకు అందించింది



విజయవాడ, మహానగర్

రాష్ట్రంలో పేదల సొంతింటి కలను సాకారం చేసే దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేస్తోంది. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ్ (గ్రామీణ్-+) 2.0 పథకం కింద కేంద్ర ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన మూడు లక్షల ఇళ్ల నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో కలిసి రేపు (అక్టోబరు 4) భూమిపూజ చేయనున్నారు. గుంటూరు జిల్లా తెనాలి నియోజకవర్గంలోని బుర్రిపాలెం గ్రామంలో ఈ కార్యక్రమం జరగనుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ 28 నెలల కాలంలో ఇప్పటికే 5.50 లక్షల ఇళ్లను లబ్ధిదారులకు అందించింది. గతేడాది నవంబరులో 3 లక్షలు, ఈ ఏడాది మార్చిలో 2.50 లక్షల ఇళ్లకు సామూహిక గృహ ప్రవేశాలు నిర్వహించిన ప్రభుత్వం, ఇప్పుడు మరో భారీ కార్యక్రమానికి శ్రీకారం చుడుతోంది. - మిగతా 3లో

ఆ ఎన్నికలన్నీ

చట్ట విరుద్ధమే




- లోక్‌సభ, అసెంబ్లీలను రద్దు చేయాలి'
- కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే సంచలన డిమాండ్
- కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సంచలన ఆరోపణలు
- దేశంలో అన్ని ఎన్నికలు చట్టవిరుద్ధంగానే నిర్వహిస్తున్నారని వ్యాఖ్యలు
- లోక్‌సభ, అసెంబ్లీలను రద్దు చేసి బ్యాలెట్ పేపర్ పద్ధతిలో మళ్లీ ఎన్నికలు జరపాలని డిమాండ్

5

అమిత్ షా తెలంగాణ

పర్యటన రద్దు



- చివరి నిమిషంలో కీలక నిర్ణయం!
- తొలుత అక్టోబర్ 4న పర్యటనకు ఖరారైన షెడ్యూల్
- మెదక్, కరీంనగర్‌లో పర్యటనకు ఏర్పాట్లు పూర్తి
- షెడ్యూల్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు
- నిరాశలో బీజేపీ శ్రేణులు



పేలిన బాయిలర్!

- ఎస్టిల్ హెల్త్‌కేర్ పరిశ్రమలో దుర్ఘటన
- పేలుడు ధాటికి కుప్పకూలిన భవనం
- బాయిలర్‌లోని నీటి స్థాయి విషయంలో తేడా కారణంగానే పేలుడు?
- మృతుల కుటుంబాలకు 50 లక్షల పరిహారం

2

ఆంధ్రప్రదేశ్‌కు ఐఐటీయన్ల మేధస్సు

-మొదటిపేజీ తరువాయి

సీఎం ఆవిష్కరించారు. అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్‌కు అవసరమైన మౌలిక వసతులు ఇప్పటికే అభివృద్ధి చెందుతున్నాయని, ఐబీఎం--టీసీఎస్, ఎల్‌అండ్‌టీ సంయుక్తంగా ఏర్పాటు చేస్తున్న క్వాంటం కంప్యూటర్ వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి అమరావతి కేంద్రంగా ఆపరేట్ కానుందని వెల్లడించారు. 156 క్యూబిట్ క్వాంటం సిస్టమ్ అందుబాటులోకి వచ్చేలోగా అవసరమైన మౌలిక వసతులు సిద్ధం చేయాలని సూచించారు. సిలికాన్ వ్యాలీ గురించి మాట్లాడినట్లుగానే భవిష్యత్తులో అమరావతి క్వాంటం వ్యాలీ గురించి ప్రపంచం మాట్లాడేలా చేయాలని సీఎం ఆకాంక్షించారు. క్వాంటం కంప్యూటర్లతో పాటు వాటికి అవసరమైన పరికరాలను కూడా రాష్ట్రంలో తయారు చేసి ఎగుమతి చేసే స్థాయికి ఏపీ ఎదగాలని అన్నారు. దేశం, రాష్ట్రం కేవలం టెక్నాలజీ వినియోగదారులుగా కాకుండా ఉత్పత్తిదారులుగా మారాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. వచ్చే రెండేళ్లలో కమర్షియల్ క్వాంటం కంప్యూటర్ల ఉత్పత్తికి అవకాశం ఉందని, అందుకు అనుగుణంగా నైపుణ్యాలు, పరిశోధన, తయారీ సామర్థ్యాలను అభివృద్ధి చేయాలని చెప్పారు. రాష్ట్రంలోని విద్యాసంస్థల్లో ఐఐటీ స్థాయి ల్యాబ్‌లను ఏర్పాటు చేయడంతో పాటు ఆరో తరగతి నుంచే విద్యార్థుల్లో ఎంట్రప్రెన్యూర్‌షిప్ నైపుణ్యాలను పెంపొందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఏపీ అభివృద్ధికి సాంకేతికతను బదిలీ చేసేందుకు 23 ఐఐటీలు, 25 ఇన్నోవేషన్ హబ్‌ల నుంచి టెక్నాలజీలను గుర్తించి రాష్ట్రంలోని పరిశ్రమలు, స్టార్టప్‌లు, ఉత్పత్తుల అభివృద్ధికి అందుబాటులోకి తీసుకురానున్నారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలను పాన్ ఐఐటీ ఎకోసిస్టంతో అనుసంధానం చేసి పరిశోధన, ఫ్యాకల్టీ, విద్యార్థులకు కొత్త అవకాశాలు కల్పించనున్నారు. ఇందుకోసం 10 ఇండస్ట్రీ చాప్టర్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న 100 మంది ఐఐటీ మెంటర్లతో నెట్‌వర్క్ ఏర్పాటు చేసి ఏపీ స్టార్టప్‌లు, ఔత్సాహికులకు మార్గనిర్దేశం చేయనున్నారు. 2030 నాటికి రాష్ట్రంలో కనీసం 50 స్టార్టప్‌లను ఇంక్యుబేట్ చేసేలా ప్రణాళిక



రూపొందించారు. క్వాంటమ్-ఏఐ, సెమీకండక్టర్లు, స్పేస్-డిఫెన్స్, హెల్త్, అగ్రిటెక్, బ్లూ వాటర్ ఎకానమీ వంటి రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేందుకు డీప్‌టెక్ పాలసీ ప్యాకేజీ కింద చర్యలు చేపట్టనున్నారు. మంచి ఆలోచనలను ఆచరణలో పెట్టడం ద్వారా పెద్ద మార్పులు తీసుకురావచ్చని సీఎం అన్నారు. రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేయడంతో పాటు ఆధునిక సాంకేతికత, సమర్థవంతమైన నీటి నిర్వహణతో వచ్చే పదేళ్లలో ప్రపంచ ఉద్యానవన హబ్‌గా తీర్చిదిద్దుతామని చెప్పారు. ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ తరహాలో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటు చేస్తున్నామని, దీనికి రిలయన్స్ సంస్థ సహకరించేందుకు ముందుకు వచ్చిందని తెలిపారు. దేశంలో కోటి మంది ఏఐ నిపుణులను తయారు చేయాలన్న లక్ష్యానికి అనుగుణంగా ఏపీ నుంచి 50 లక్షల మంది ఏఐ నిపుణులను అందించేలా లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు వెల్లడించారు. పాన్ ఐఐటీ ఏపీ సమ్మిట్‌లో భాగంగా ఇంధనం, స్వచ్ఛాంధ్ర, నిత్య జీవితంలో డీప్‌టెక్, స్పేస్, ఏరోస్పేస్, డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరింగ్, ఆరోగ్య సంరక్షణ, అగ్రిటెక్, రైతులు, నీటి భద్రత తదితర అంశాలపై ప్యానెల్ చర్చలు జరిగాయి. ఐఐటీ ఖరగ్‌పూర్, ఐఐటీ తిరుపతి, ఐఐటీ జమ్మూ, ఐఐటీ హైదరాబాద్, ఐఐటీ ధన్‌బాద్, ఐఐటీ వారణాసి, ఐఐటీ భువనేశ్వర్ తదితర సంస్థల డైరెక్టర్లు, ఐఐటీల సీఈఓలు, వెంచర్ క్యాపిటలిస్టులు పాల్గొన్నారు. రెండు రోజులపాటు జరిగిన సదస్సులో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ల ఏర్పాటు, టెక్నాలజీ బదిలీ, పట్టణీకరణలో డీప్‌టెక్ వినియోగం, స్టార్టప్‌లు, పెట్టుబడులు తదితర అంశాలపై చర్చించారు. ప్రతి ఏడాది పాన్ ఐఐటీ సమ్మిట్ నిర్వహించాలని సీఎం ప్రతిపాదించారు. సదస్సులో ఏర్పాటు చేసిన వివిధ సాంకేతిక ప్రదర్శన స్టాళ్లను సీఎం పరిశీలించారు.

పేలిన బాయిలర్!

తిరుపతి(టీటీడీ)/సత్యవేడు

తిరుపతి జిల్లా శ్రీసిటీలో శనివారం ఘోర ప్రమాదం సంభవించింది. టిల్ హెల్త్ కేర్ పరిశ్రమకు చెందిన బాయిలర్ పేలిన ఘటనలో ఐదుగురు కార్మికులు దుర్మరణం చెందారు. మృతుల్లో మన రాష్ట్రానికి చెందిన ఇద్దరు, తమిళనాడుకు చెందిన ఇద్దరు, పశ్చిమబెంగాల్ వాసి ఒకరు ఉన్నారు. బాయిలర్‌లోని నీటి స్థాయి విషయంలో తేడా కారణంగానే పేలుడు సంభవించినట్లు అధికారులు చెబుతున్నారు. పేలుడు ధాటికి ఒక్కసారిగా భవనం మొత్తం కుప్పకూలింది. భవన శకలాలు సమీప ప్రాంతాలతోపాటు కొంతదూరంలోని పొలాల్లో సైతం పడ్డాయి. టిల్‌హెల్త్ కేర్ భవనంలోని అద్దాలు పగిలిపోయాయి. పరిసర ప్రాంతాల్లోని పరిశ్రమలకూ స్వల్ప నష్టం వాటిల్లింది. భారీ పేలుడు కారణంగా టిల్ హెల్త్ కేర్ పరిశ్రమకు ఆనుకుని ఉన్న చెరివి, మాధనపాళెం, గొల్లవారిపాళెం తదితర గ్రామాల్లోని ఇళ్లన్నీ కంపించాయి. ఇళ్ల కిటికీ అద్దాలు పగిలి, కొన్ని ఇళ్లలోని గోడలు బీటలు వారాయి. పేలుడు శబ్దం రెండు కిలోమీటర్ల మేర వినిపించిందని, భూమి కూడా స్వల్పంగా కంపించినట్లయ్యిందని స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంతో శ్రీసిటీ ఉలిక్కిపడింది. శ్రీసిటీ ఏర్పాటు చేసిన 18 ఏళ్లలో ఇలాంటి ప్రమాదం జరగడం ఇదే తొలిసారి.

అసలేం జరిగింది?

గాంధీ జయంతి కారణంగా శుక్రవారం పరిశ్రమకు సెలవు. దీంతో శనివారం ఉదయం 8.30 గంటలకు షిఫ్ట్ ప్రారంభమైంది. బాయిలర్ ఆపరేటర్‌గా ఉన్న తడకు చెందిన వాసు (38), అతని హెల్పర్ తమిళనాడు మాదరపాక్కంకు చెందిన రమేశ్ (45) బాయిలర్ హౌస్‌కు చేరుకున్నారు. బాయిలర్‌లోని నీటి స్థాయిలను చెక్ చేసుకోకుండా.. దాన్ని ఆన్ చేయడంతో పేలుడు సంభవించినట్లు తెలుస్తోంది. పేలుడు ధాటికి బాయిలర్ భవనం కుప్పకూలింది. వాసు, రమేశ్ తీవ్రంగా గాయపడ్డారు. బాయిలర్ హౌస్‌కు ఆనుకుని ఉన్న ఆలయానికి దండం పెట్టుకునేందుకు వచ్చిన పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఆర్‌వో ప్లాంట్ ఇన్‌చార్జి గౌరబ్‌రాయ్(36), భవనం పక్కనే ఉన్న తమిళనాడులోని నాయుడుకుప్పానికి చెందిన ఎలక్ట్రీషియన్ మోహన్‌రాజు(19), సత్యవేడు మండలం చెరివి గ్రామానికి చెందిన ఈటీపీ ఆపరేటర్ చిన్న మస్తాన్(45) పైనా శకలాలు పడ్డాయి. గౌరబ్‌రాయ్, మోహన్‌రాజు తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతిచెందారు. గాయపడిన రమేశ్, చిన మస్తాన్‌లను సత్యవేడులోని సీహెచ్‌సీకి తరలించగా.. అప్పటికే వారు మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. వాసును చెన్నైలోని ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. శనివారం ఉదయం షిఫ్ట్‌కు కార్మికులు, ఉద్యోగులు కంపెనీ గేటు ముందు బస్సు దిగి ఫ్యాక్టరీలోకి వస్తున్న క్రమంలోనే పేలుడు సంభవించింది. దీంతో ఒక్కసారిగా అందరూ భయపడ్డారు. కొందరు అక్కడకు వెళ్లి గాయపడిన వారిని కాపాడే ప్రయత్నం చేశారు.

బాయిలర్‌లో నీళ్ల కొరత కారణంగానేనా?


ఘటన స్థలాన్ని కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, శ్రీసిటీ ఎండీ రవి సన్నారెడ్డి పరిశీలించారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాద కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ బాయిలర్లు 30 ఏళ్ల వరకు పనిచేస్తాయని, ఇక్కడి బాయిలర్ పన్నెండున్నరేళ్ల క్రితం ఏర్పాటు చేశారని తెలిపారు. నీళ్ల కొరత/నీళ్లు అందకపోవడం వల్ల ప్రమాదం జరిగిందని అంచనా వేస్తున్నామన్నారు. ఘటనపై దర్యాప్తు చేసి చర్యలు తీసుకుంటామని చెప్పారు. బాయిలర్ ఇన్‌స్పెక్టర్ రాంబాబును సస్పెండ్ చేశామని, శ్రీసిటీలోని అన్ని పరిశ్రమల్లోనూ సేఫ్టీ ఆడిట్ చేయిస్తామని చెప్పారు. సీఎం చంద్రబాబు ఆదేశాలకు మేరకు మృతుల కుటుంబాలకు రూ.50 లక్షల చొప్పున పరిహారం అందిస్తామన్నారు. తక్షణ సాయం కింద శ్రీసిటీ నుంచి కొంత మొత్తం అందించినట్లు చెప్పారు. శ్రీసిటీ యాజమాన్యం తరపున మృతుల కుటుంబాల్లోని పిల్లలకు ఉచిత విద్య, కుటుంబంలో ఒకరికి శ్రీసిటీలోని పరిశ్రమల్లో ఉద్యోగం వంటి ఉపశమన చర్యలను కూడా ప్రకటించారు.

చంద్రబాబు, లోకేశ్ దిగ్భ్రాంతి

శ్రీసిటీ సెజ్‌లోని టిల్ హెల్త్‌కేర్ పరిశ్రమలో ప్రమాద ఘటనపై సీఎం చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదం జరిగిన తీరు, తీవ్రత, ప్రాణ నష్టం గురించి అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలకు అండగా ఉండాలని అధికారులను ఆదేశించారు. బాయిలర్ పేలి కార్మికులు మృతిచెందడం తీరని విషాదమని మంత్రి లోకేశ్ అన్నారు.

నిరంతర ప్రయోగశీలి సింగీతం

దిగ్దర్శకుడు సింగీతం శ్రీనివాస రావు కన్నుమూత
సినిమాకు సరికొత్త వ్యాకరణం నేర్పిన దార్శనికుడు



భారతీయ సినిమాకు సరికొత్త వ్యాకరణాన్ని పరిచయం చేసి నిరంతర ప్రయోగాలతో దేశ ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టిన దిగ్దర్శకుడు సింగీతం శ్రీనివాస రావు (94) శనివారం చెన్నైలోని కావేరి ఆసుపత్రిలో కన్నుమూశారు. గత కొంతకాలంగా ఆయన వయోభారంతో బాధపడుతున్నారు. 1931 సెప్టెంబర్ 21న నెల్లూరు జిల్లా ఉదయగిరిలో ఆయన జన్మించారు. సుమారు ఆరు దశాబ్దాల సినీ ప్రయాణంలో తెలుగు, కన్నడ, తమిళ, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో దాదాపు 60 చిత్రాలకు దర్శకత్వం వహించారాయన. విభిన్న జోనర్లలో పలు భారతీయ భాషల్లో సినిమాలు తెరకెక్కించి బహుముఖ ప్రజ్ఞాశాలిగా, ప్రయోగాత్మక దర్శకుడిగా కీర్తి పొందారు.

కె.వి.రెడ్డి దగ్గర సినీ ప్రయాణం మొదలు..

కళాశాల రోజుల నుంచే నాటకాలతో పాటు హాలీవుడ్ సినిమాలపై అమితమైన మక్కువ కనబరిచేవారు సింగీతం శ్రీనివాస రావు. చెన్నైలోని ప్రెసిడెన్సీ కాలేజీలో భౌతికశాస్త్రంలో డిగ్రీ పూర్తి చేశారు. ఆయన రాసిన భ్రమ, అంత్యఘట్టం వంటి ప్రయోగాత్మక నాటకాలు పలు అవార్డులు అందుకున్నాయి. అనంతరం కె.వి.రెడ్డి దగ్గర సహాయ దర్శకుడిగా పనిచేస్తూ దర్శకత్వం తాలూకు అనేక విషయాలను అధ్యయనం చేశారు. 'మాయా బజార్' వంటి తెలుగు కల్ట్‌క్లాసిక్ సినిమా నిర్మాణాన్ని దగ్గర ఉండి పరిశీలించే అవకాశం పొందారు. కె.వి.రెడ్డి వంటి దిగ్గజ దర్శకుడి దగ్గర మాయాబజార్, జగదేక వీరుని కథ, శ్రీకృష్ణార్జున యుద్ధం వంటి చిరస్మరణీయ చిత్రాలకు పనిచేయడంతో భావోద్వేగాలను, హాస్యాన్ని, ఫాంటసీ అంశాలను మేళవించి జనరంజకమైన సినిమాల్ని ఎలా రూపొందించాలో అవగాహన పెంచుకున్నారు

సింగీతం శ్రీనివాస రావు. 1972లో 'నీతి నిజాయితీ' చిత్రంతో దర్శకుడిగా అరంగేట్రం చేశారాయన. సరికొత్త కాన్సెప్ట్‌తో రూపొందిన ఈ చిత్రం విమర్శకుల ప్రశంసలు పొందినప్పటికీ వాణిజ్యపరంగా మాత్రం ఆశించిన విజయాన్ని సాధించలేదు. 1977లో ఆయన తెరకెక్కించిన 'తరం మారింది' చిత్రం సామాజిక సమస్యలను చర్చిస్తూ సందేశంతో ఆకట్టుకుంది. అనంతర కాలంలో ఆయన జమీందారు గారి అమ్మాయి, అమెరికా అమ్మాయి, పంతులమ్మ, గమ్మత్తు గూఢచారులు, పుష్పక విమానం, సుగుణసుందరి, అమావాస్య చంద్రుడు, సొమ్మొకడిది సోకొకడిది, మయూరి, అమెరికా అబ్బాయి, ఆదిత్య 369, బృందావనం, భైరవద్వీపం, మేడమ్ వంటి విభిన్న కథాంశాలతో కూడిన చిత్రాలకు దర్శకత్వం వహించారు. ఆయన చిత్రాలు కాన్సెప్ట్‌ల పరంగా వేటికవే ప్రత్యేకంగా నిలిచిపోయాయి. సుధాచంద్రన్ జీవితాన్ని ఆధారంగా చేసుకొని రూపొందించిన 'మయూరి' చిత్రం స్ఫూర్తివంతమైన చిత్రాల్లో ఒకటిగా కీర్తి సంపాదించుకుంది. ప్రమాదంలో కాలు కోల్పోయిన యువతి తన నాట్యాన్ని వదులుకోకుండా తిరిగి జీవితంలో విజేతగా గెలిచిన వైనాన్ని హృదయాల్ని కదిలించేలా హృద్యంగా, చైతన్యపూరితంగా తెరకెక్కించారు సింగీతం శ్రీనివాసరావు. ఈ సినిమా 14 నంది అవార్డులను గెలుచుకొని సంచలనం సృష్టించింది. 1989లో వచ్చిన 'అపూర్వ సహోదరులు' చిత్రం సింగీతం శ్రీనివాసరావు సినీ కెరీర్‌లో మరో కలికితురాయిగా నిలిచిపోయింది. ఇందులో కథానాయకుడు కమల్‌హాసన్ మరుగుజ్జు పాత్రలో నటించి మెప్పించారు.

ఘనంగా అంగన్‌వాడీ సేవా సంకల్ప అభియాన్



ఆగిరిపల్లి, మహానగర్:

మండల పరిధిలోని నెక్కలం గొల్లగూడెం గ్రామంలోని గొల్లగూడెం--2 అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం అంగన్‌వాడీ ఉత్సవం, సేవా సంకల్ప అభియాన్, పోషణ మాస కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల మహిళా అధ్యక్షురాలు అన్నే విజయరాణి, నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు శీలం పద్మశ్రీ, ప్రధాన కార్యదర్శి బి. అంజలి, నూజివీడు అర్బన్ తెలుగు మహిళా అధ్యక్షురాలు యార్లగడ్డ రాధాకుమారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి. రాగమయి, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, తల్లులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాగమయి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను, పౌష్టికాహార పదార్థాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పౌష్టికాహారం ప్రాముఖ్యతను వివరించారు. చిన్నారుల ఎదుగుదలలో సమస్యలను ముందుగానే గుర్తించేందుకు ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో స్క్రీనింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండల మహిళా అధ్యక్షురాలు అన్నే విజయరాణి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పోషకాహారాన్ని లబ్ధిదారులు ఇంటికి తీసుకెళ్లి స్వయంగా వినియోగించుకోవాలని సూచించారు. పోషకాహారాన్ని సక్రమంగా తీసుకోవడం ద్వారా రక్తహీనతను నివారించవచ్చని తెలిపారు. బాల్య వివాహాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు శీలం పద్మశ్రీ మాట్లాడుతూ మునగాకు ప్రాముఖ్యతను, గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు అందిస్తున్న సేవలను గుర్తించి వారిని అభినందించారు. అనంతరం లబ్ధిదారులు, నాయకులు కలిసి అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లను సన్మానించారు.

రైతులకు బాబు లక్ష మోసాలు

అమరావతి

సంపద సృష్టించి ప్రతి హామీ నెరవేరుస్తానని ఇంటింటికీ బాండ్లు పంచిన సీఎం చంద్రబాబు ప్రభుత్వ పాలన మూడో ఏడాది నడుస్తోంది... ఇప్పుడు రాష్ట్రంలో కరువు విలయతాండవం చేస్తుంటే రాయలసీమలో హార్టికల్చర్‌కు రూ. లక్ష కోట్లు అంటూ పిట్టలదొర మాటలు చెబుతూ మరోవైపు రైతులను లక్ష మోసాలకు గురి చేస్తున్నారని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఈ మేరకు శనివారం ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. అందులో ఆయన ఇంకా ఏమన్నారంటే..

చంద్రబాబు ఏరోజైనా పట్టించుకున్నారా?

రూ. లక్ష కోట్లంటూ చంద్రబాబు పిట్టలదొర మాటలు చెబుతూ, మరోవైపు రైతులను లక్ష మోసాలకు గురి చేస్తున్నారు. రాయలసీమలో హార్టికల్చర్‌కు రూ. లక్ష కోట్లు అంటూ చంద్రబాబు చేస్తున్నవి డ్రామాలు, అంకెల గారడీలు కాక మరేమిటి? బడ్జెట్లో కేటాయింపులు లేకుండా, ఒక్క రూపాయి ఖర్చు చేయకుండా, రైతుల్ని ఇంతలా మభ్యపెట్టడం చంద్రబాబుకు మాత్రమే సాధ్యం. రైతులమీద ప్రేమ మాటలకు, ప్రచారాలకు మాత్రమే పరిమితం అని రెండున్నరేళ్ల చంద్రబాబు పాలనే పలుమార్లు రుజువు చేసింది. హార్టికల్చర్ సహా పంటలకు ధరల్లేక రైతులు రోడ్డున పడితే, రోజూ ధర్నాలు చేస్తే చంద్రబాబు ఏరోజైనా పట్టించుకున్నారా? మా ప్రభుత్వంలో పెట్టిన ధరల స్థిరీకరణ నిధిని నిర్వీర్యంచేసి, ఉచిత పంటల బీమాను తీసివేసి రైతుల వెన్నువిరిచిన మాట వాస్తవం కాదా?. సున్నా వడ్డీ పథకాన్ని రద్దుచేసి, సమయానికి ఇచ్చే ఇన్‌పుట్ సబ్సిడీని నిర్వీర్యం చేసి రైతుల నడ్డివిరిచారు. చంద్రబాబు పబ్లిసిటీ డ్రామాలు చేసి, వాటినే నిజాలుగా ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తారు గానీ రైతుల కష్టసుఖాల గురించి ఏరోజూ పట్టించుకోరనడానికి ఇంతకన్నా సాక్ష్యం ఏం కావాలి?

డ్రామాలు, బిల్డప్‌లు కట్టిపెట్టి.. కరువు నివారణా చర్యలు మొదలు పెట్టాలి

తీవ్రమైన కరువు కారణంగా రాయలసీమలో ఇప్పుడు తీవ్ర దుర్భిక్షం నెలకొంటే, వేలాది ఎకరాల్లో హార్టికల్చర్ తోటలు ఎండిపోతుంటే... చంద్రబాబు వాటర్ మ్యాన్ అని బిల్డప్ ఇవ్వడం చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు. ఓ పక్క రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్టుకు చంద్రబాబే అడ్డుతగులుతున్నారు. మరోపక్క ఒక్క రాయలసీమ ప్రాంతంలోనే దాదాపుగా 78 లక్షల బోర్లు ఎండిపోయాయి. ఈ పరిస్థితుల్లో రైతులు ట్యాంకర్ నీటికోసం రూ.1500 నుంచి రూ.2,000 ఖర్చుచేసి, ఆ చెట్లను బతికించేందుకు నానా అగచాట్లు పడుతున్నా సీఎం చంద్రబాబు పట్టించుకోవడం లేదు. ఇక హార్టికల్చర్ హబ్ సంగతి పక్కనపెడితే, రైతుల ఆత్మహత్యలకు చిరునామాగా రాయలసీమ సహా రాష్ట్రం మొత్తం తయారయ్యింది. చంద్రబాబు ఇప్పటికైనా డ్రామాలు, బిల్డప్‌లు కట్టిపెట్టి, రైతులకు ఊరటనిచ్చేలా తక్షణమే కరువు నివారణా చర్యలు మొదలుమొట్టాలి.

పేదల కోసం మరో 3 లక్షల ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం

-మొదటిపేజీ తరువాయి

రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు కేంద్రం ఇటీవలే ఈ 3 లక్షల ఇళ్లను కేటాయించింది. దీంతో ఏమాత్రం జాప్యం చేయకుండా నిర్మాణ పనులను ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇదే సమయంలో, వచ్చే ఏడాది మార్చి నాటికి మరో 4.20 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

దేశంలోనే తొలిసారిగా 3డీ ప్రింటింగ్ టెక్నాలజీ

ఈ కార్యక్రమంతో పాటు, గృహ నిర్మాణ రంగంలో విప్లవాత్మక మార్పులకు నాంది పలుకుతూ దేశంలోనే తొలిసారిగా 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీతో ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన పైలట్ ప్రాజెక్టుకు కూడా చంద్రబాబు, శివరాజ్ సింగ్ చౌహాన్ శంకుస్థాపన చేయనున్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, సీఎస్ఐఆర్-సీబీఆర్ఐ (రూర్కీ), ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా ఈ ప్రాజెక్టును చేపడుతున్నాయి. పైలట్ ప్రాజెక్టు కింద తెనాలి నియోజకవర్గంలోని బుర్రిపాలెం, ఓబులనాయుడు పాలెం గ్రామాల్లో రూ.14 కోట్ల అంచనా వ్యయంతో 177 ఇళ్లను నిర్మించనున్నారు. ఈ అత్యాధునిక టెక్నాలజీ ద్వారా అత్యంత వేగంగా, తక్కువ శ్రమతో నిర్మాణం పూర్తి చేయడం, నిర్మాణ వ్యర్థాలను తగ్గించడం, నాణ్యత, పటిష్ఠతను పెంచడం సాధ్యమవుతుందని అధికారులు వివరిస్తున్నారు.

ముఖ్యమంత్రి పర్యటన వివరాలు

సీఎం చంద్రబాబు ఆదివారం ఉదయం 10:15 గంటలకు ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి బయలుదేరి 10:35 గంటలకు బుర్రిపాలెం చేరుకుంటారు. ఉదయం 10:40 గంటలకు 3డీ ఇళ్ల నిర్మాణ పైలట్ ప్రాజెక్టుకు భూమిపూజ చేసి, అనంతరం లబ్ధిదారులతో సమావేశమవుతారు. 11:10 గంటలకు అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగిస్తారు. పర్యటన ముగించుకుని మధ్యాహ్నం 1:35 గంటలకు తిరిగి క్యాంపు కార్యాలయానికి చేరుకుంటారు.

ప్రతిభావంతులకు గుర్తింపు.. సేవామూర్తులకు గౌరవం

ఘనంగా 'స్టేట్ ఇన్‌ఫ్లూయెన్సర్స్ అవార్డ్స్--2026'కు కర్టెన్ రైజర్

సందడి చేసిన బాలీవుడ్ నటి జ్యోతి బిశ్వాస్

వివిధ రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్న వారికి అవార్డులు



విజయవాడ, మహానగర్

వివిధ రంగాల్లో ప్రతిభ, సేవా కార్యక్రమాలు, సృజనాత్మకతతో ప్రత్యేక గుర్తింపు పొందుతున్న వ్యక్తులను సత్కరించేందుకు గ్లోబల్ ఐకాన్స్ ఫోరం సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'స్టేట్ ఇన్‌ఫ్లూయెన్సర్స్ అవార్డ్స్--2026'కు శనివారం ఘనంగా శ్రీకారం చుట్టారు. మొగల్రాజపురంలోని విగ్నేష్ హాస్పిటల్‌లో నిర్వహించిన కర్టెన్ రైజర్ కార్యక్రమం ఉల్లాసంగా, ఉత్సాహంగా జరిగింది. ప్రముఖ బాలీవుడ్ నటి జ్యోతి బిశ్వాస్ ముఖ్య అతిథిగా హాజరు కావడంతో కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్య, వైద్యం, కళలు, సంస్కృతి, సినిమా, వ్యాపారం, సామాజిక సేవ, డిజిటల్ మీడియా, సోషల్ మీడియా తదితర రంగాల్లో విశేష ప్రతిభ చూపుతున్న వారిని గుర్తించి గౌరవించడమే అవార్డుల ప్రధాన ఉద్దేశమని గ్లోబల్ ఐకాన్స్ ఫోరం సొసైటీ జాతీయ అధ్యక్షుడు చైతన్య జంగా, జాతీయ కార్యదర్శి జయా పటేరియా తెలిపారు. సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, తమ రంగాల్లో ప్రత్యేక ముద్ర వేస్తున్న వ్యక్తులను ప్రోత్సహించడం ద్వారా మరింత మందికి స్ఫూర్తినివ్వాలనే లక్ష్యంతో ఈ అవార్డులను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సొసైటీ ఉపాధ్యక్షుడు ఈశ్వర్ మిత్తాన మాట్లాడుతూ వివిధ రంగాల్లో ప్రజలపై సానుకూల ప్రభావం చూపుతున్న అర్హులైన వ్యక్తులను గుర్తించి అవార్డులతో సత్కరించనున్నట్లు తెలిపారు. ప్రతిభకు ప్రోత్సాహం, సేవలకు గుర్తింపు, సమాజానికి స్ఫూర్తి అందించడమే కార్యక్రమం లక్ష్యమన్నారు. అవార్డుల ఎంపికలో అభ్యర్థుల అర్హత, ప్రతిభ, వృత్తిపరమైన విజయాలు, సామాజిక సేవ, ప్రజలపై చూపుతున్న సానుకూల ప్రభావం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వివిధ రాష్ట్రాల నుంచి అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేసి వారికి జాతీయ స్థాయిలో తమ ప్రతిభను చాటుకునే వేదిక కల్పించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో విగ్నేష్ హాస్పిటల్ అధినేత డాక్టర్ వల్లి కొడాలి, బీజేపీ జాతీయ మోర్చా సోషల్ మీడియా కన్వీనర్ సిరి కిరణ్, డాక్టర్ చిలకపాటి రామచంద్, ప్రముఖ మేకోవర్ ఆర్టిస్ట్ ప్రణవి, కోడె చైతన్య, ఆర్.వి. అప్పారావు, ఇమాన్యుల్ తదితరులు పాల్గొన్నారు. కళాకారులు, సామాజికవేత్తలు, వ్యాపారవేత్తలు, ఇన్‌ఫ్లూయెన్సర్లు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు కార్యక్రమంలో పాల్గొన్నారు. కర్టెన్ రైజర్‌తో అవార్డుల ఎంపిక, నిర్వహణ ప్రక్రియకు అధికారికంగా శ్రీకారం చుట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. అవార్డులకు సంబంధించిన పూర్తి వివరాల కోసం 9866333787, 9848669996 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

సామాన్య భక్తులకు ప్రాధాన్యత

- వినూత్న కార్యాచరణతో సమగ్ర సౌకర్యాలు
- ఏఐ డిస్‌ప్లే బోర్డులు, వైల్డ్ ట్యాగ్స్, బూమ్ బ్యారియర్స్‌తో పటిష్ట భద్రత
- 24 గంటలూ పనిచేసే కమాండ్ కంట్రోల్ సెంటర్
- 3,500 మంది సిబ్బందితో బందోబస్తు
- దసరా ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖరబాబు



విజయవాడ, మహానగర్

ఈ నెల 11వ తేదీ ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుంచి 20వ తేదీ ఆశ్వయుజ శుద్ధ దశమి వరకు జరగనున్న దసరా మహోత్సవాలకు వచ్చే సామాన్య భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖరబాబు, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర, దుర్గగుడి ఈవో వీకే శీనా నాయక్ తెలిపారు. భక్తుల భద్రత, సౌకర్యాలు, సులభ దర్శనానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ అన్ని శాఖల సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. శనివారం కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబు, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర, ఈవో శీనా నాయక్ రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక, దేవాదాయ, ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ తదితర శాఖల అధికారులతో కలిసి దసరా ఉత్సవాల ఏర్పాట్లపై సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. సీతమ్మవారి పాదాలు, కేశఖండనశాల, హోల్డింగ్ ఏరియాలు, వినాయక టెంపుల్, రథం సెంటర్, టోల్‌గేట్, ఘాట్‌రోడ్డు మీదుగా నడుచుకుంటూ వెళ్లి ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు భద్రత, సౌకర్యాల కల్పనలో ఎక్కడా రాజీ పడకుండా, ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కొండపై నిర్వహించిన మీడియా సమావేశంలో అధికారులు వివరాలు వెల్లడించారు. కలెక్టర్ డా. జి. లక్ష్మీశ మాట్లాడుతూ దసరా ఉత్సవాల సందర్భంగా భారీగా తరలివచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వినూత్న కార్యాచరణను రూపొందించినట్లు తెలిపారు. భక్తుల రాకపోకలు, దర్శనం, క్యూలైన్ల నిర్వహణ, పార్కింగ్, తాగునీరు, వైద్య సేవలు, పారిశుద్ధ్యం తదితర అంశాలపై సమగ్ర ప్రణాళికతో ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. భక్తులకు అవసరమైన సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించేందుకు ఏఐ ఆధారిత డిస్‌ప్లే బోర్డులను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. 24 గంటలూ సేవలందించే కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఘాట్ల వద్ద జల్లు స్నానాలకు కూడా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఈసారి పున్నమి ఘాట్‌లో జాతీయ సరస్ మేళా నిర్వహించనున్న నేపథ్యంలో, గౌరవ రాష్ట్రపతి కూడా హాజరుకానున్నందున అదనపు భద్రతా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. సీపీ ఎస్.వి. రాజశేఖరబాబు మాట్లాడుతూ 2024 నుంచి దసరా ఉత్సవాల నిర్వహణలో సాంకేతిక పరిజ్ఞానానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ వినూత్న ప్రణాళికలను అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది మరింత పకడ్బందీగా ఏర్పాట్లు చేపడుతున్నామని, బూమ్ బ్యారియర్స్, యాక్సెస్ కంట్రోలర్స్ వంటి సాంకేతిక పరికరాలను వినియోగించనున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి మార్గనిర్దేశం మేరకు సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మొత్తం 22 పార్కింగ్ పాయింట్లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. దసరా ఉత్సవాల బందోబస్తు కోసం 3,500 మంది సిబ్బందిని మోహరిస్తున్నామని, యంగ్ అండ్ డైనమిక్ పోలీసు సిబ్బంది విధుల్లో పాల్గొంటారని చెప్పారు. ఈసారి క్రౌడ్ అనలిటిక్స్‌కు మరింత ప్రాధాన్యతనిస్తూ భక్తుల రద్దీని నిరంతరం పర్యవేక్షించి, పరిస్థితులకు అనుగుణంగా సమగ్ర చర్యలు తీసుకుంటామని తెలిపారు. చైల్డ్ ట్యాగ్స్, బూమ్ బ్యారియర్స్ తదితర భద్రతా చర్యలతో పాటు మూడు హోల్డింగ్ ఏరియాల్లో భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ దసరా ఉత్సవాలకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, మరుగుదొడ్ల ఏర్పాటు తదితర మౌలిక సదుపాయాలను సమగ్రంగా కల్పిస్తున్నామని తెలిపారు. భక్తుల రద్దీకి అనుగుణంగా పారిశుద్ధ్య సిబ్బందిని అందుబాటులో ఉంచి పరిసరాలను నిరంతరం పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. స్వచ్ఛ దసరా స్ఫూర్తితో ఉత్సవాల నిర్వహణకు ముందడుగు వేస్తున్నామని తెలిపారు. దేవస్థానం ఈవో వీకే శీనా నాయక్ మాట్లాడుతూ దసరా ఉత్సవాల సందర్భంగా నిర్వహించనున్న ప్రత్యేక పూజలు, ప్రత్యేక దర్శనాలకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఉత్సవాల సందర్భంగా ఆలయంలో ఆధ్యాత్మిక శోభ ప్రతిబింబించేలా ప్రత్యేక అలంకరణలు, పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ దసరా మహోత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు సమష్టిగా కృషి చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

న్యాయాధికారుల పదవీ విరమణ వయస్సు 61 నుంచి 62 ఏళ్లకు పెంపు

గవర్నర్ ఆర్డినెన్స్ జారీ

సుప్రీంకోర్టు, హైకోర్టు సూచనల మేరకు నిర్ణయం

న్యాయ, మైనారిటీ సంక్షేమ మంత్రి ఎన్ఎండీ ఫరూక్



అమరావతి, మహానగర్

రాష్ట్రంలో పనిచేస్తున్న న్యాయాధికారుల పదవీ విరమణ వయస్సును 61 సంవత్సరాల నుంచి 62 సంవత్సరాలకు పెంచుతూ రాష్ట్ర గవర్నర్ ఈ నెల 1న ఆర్డినెన్స్ జారీ చేసినట్లు న్యాయ, మైనారిటీ శాఖల మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. ఈ పెంపు 2026 మార్చి 31వ తేదీ నుంచి అమల్లోకి వచ్చినట్లుగా పరిగణించబడుతుందని శనివారం అమరావతిలో విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. గవర్నర్ ఆమోదంతో దీనికి సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్ కూడా ప్రచురించబడినట్లు మంత్రి వెల్లడించారు. గతంలో న్యాయాధికారుల పదవీ విరమణ వయస్సును 2024 నవంబర్ 1 నుంచి అమల్లోకి వచ్చేలా 60 సంవత్సరాల నుంచి 61 సంవత్సరాలకు పెంచిన విషయం తెలిసిందేనని ఫరూక్ తెలిపారు. అనంతరం సుప్రీంకోర్టు 2026 ఆగస్టు 5న డబ్ల్యూ.పీ.(సి) నెం.1022/1989లో జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వుల్లో పేర్కొన్న అంశాలను పరిగణనలోకి తీసుకుని న్యాయాధికారుల పదవీ విరమణ వయస్సును 62 సంవత్సరాలకు పెంచే అంశాన్ని పునఃపరిశీలించాలని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఆగస్టు 24న నిర్వహించిన పూర్తిస్థాయి సమావేశంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ధర్మాసనం కూడా న్యాయాధికారుల పదవీ విరమణ వయస్సును 62 సంవత్సరాలకు పెంచాలని తీర్మానించినట్లు మంత్రి పేర్కొన్నారు. సుప్రీంకోర్టు, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు సూచనలు, సిఫారసులను పరిగణనలోకి తీసుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనను రూపొందించగా, దాని మేరకు గవర్నర్ ఆర్డినెన్స్ జారీ చేసినట్లు న్యాయశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ వెల్లడించారు.

'సుజనా ఫౌండేషన్' ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

160 మందికి నిపుణులైన వైద్యుల సేవలు.. ఉచితంగా మందుల పంపిణీ

డెంటల్, కంటి పరీక్షలతో పాటు ఈసీజీ, 2డీ ఎకో, ఎక్స్‌రే, బీపీ, షుగర్ పరీక్షలు



విజయవాడ, మహానగర్

పేద, మధ్యతరగతి ప్రజల ఆరోగ్య సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆధ్వర్యంలోని 'సుజనా ఫౌండేషన్' ద్వారా ప్రతి వారం నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలకు విశేష స్పందన లభిస్తోంది. ఇందులో భాగంగా శనివారం హెచ్‌బీ కాలనీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో సద్వినియోగం చేసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగిన శిబిరంలో మొత్తం 160 మందికి నిపుణులైన వైద్యుల బృందం వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్స అందించింది. డెంటల్, కంటి పరీక్షలతో పాటు ఈసీజీ, 2డీ ఎకో, ఎక్స్‌రే, బీపీ, షుగర్ తదితర పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. జనరల్ ఫిజీషియన్లు కూడా రోగులను పరీక్షించి అవసరమైన వైద్య సూచనలు అందించారు. చికిత్స అనంతరం అవసరమైన మందులను కూడా ఉచితంగా పంపిణీ చేశారు. కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను పేద, మధ్యతరగతి ప్రజలకు ఉచితంగా అందించాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే సుజనా చౌదరి ఈ వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శిబిరంలో మాజీ కార్పొరేటర్ యేదుపాటి రామయ్య, 42వ డివిజన్ జనసేన పార్టీ అధ్యక్షురాలు తిరుపతి అనూష, 42వ డివిజన్ బీజేపీ ఇన్‌చార్జి బెన్నా భక్తుల సోమేశ్వరరావు, 43వ డివిజన్ జనసేన పార్టీ అధ్యక్షుడు బొల్లేపల్లి కోటేశ్వరరావుతో పాటు ఆంధ్రా హాస్పిటల్స్, శంకర నేత్ర చికిత్సాలయం వైద్యులు, ప్రభుత్వ డెంటల్ వైద్యులు, సుజనా మిత్రా కోఆర్డినేటర్లు, సుజనా ఫౌండేషన్ సిబ్బంది పాల్గొని తమ సేవలు అందించారు.

ఈ నెల 18 వరకు జోయాలు క్యాస్ బ్రిలియన్స్ డైమండ్ జ్యువెలరీ షో



వరంగల్

'ద వరల్డ్స్ ఫేవరెట్ జ్యువెలర్'గా పేరొందిన జోయాలుక్కాస్ నగరంలోని విజయ టాకీస్ ఎదురుగా ఉన్న తమ షోరూమ్‌లో 'బ్రిలియన్స్ డైమండ్ జ్యువెలరీ షో'ను నిర్వహిస్తోంది. ఈ నెల 2న ప్రారంభమైన ఈ ప్రత్యేక వజ్రాభరణాల ప్రదర్శన 18వ తేదీ వరకు కొనసాగనుంది. వజ్రాభరణాల్లో నైపుణ్యం, సొబగులు, సరికొత్త డిజైన్లను ఒకే వేదికపై పరిచయం చేస్తూ ఈ ప్రదర్శనను ఏర్పాటు చేసినట్లు సంస్థ తెలిపింది. పెళ్లిళ్లకు ఉపయోగించే అద్భుతమైన నగల సెట్ల నుంచి నిత్య జీవితంలో ధరించేందుకు అనువైన ఆధునిక ఆభరణాల వరకు విభిన్న డిజైన్లు ప్రదర్శనలో అందుబాటులో ఉన్నాయి. సంప్రదాయ శైలికి ఆధునికతను జోడిస్తూ రూపొందించిన ప్రతి డిజైన్ ప్రత్యేకతను ప్రతిబింబించేలా ఉంటుందని సంస్థ పేర్కొంది. జోయాలుక్కాస్ గ్రూప్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జోయ్ అలుక్కాస్ మాట్లాడుతూ వజ్రాల శాశ్వత ఆకర్షణకు, ఆభరణాల రూపకల్పనలో తమ సంస్థ పాటించే అత్యున్నత ప్రమాణాలకు 'బ్రిలియన్స్ డైమండ్ జ్యువెలరీ షో' ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. తెలంగాణ తమ సంస్థ ప్రయాణంలో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉందని, పండుగల సందర్భంగా నిర్వహిస్తున్న ఈ ప్రదర్శనలో అందం, ప్రత్యేకత, అత్యుత్తమ కళాత్మకతను ప్రతిబింబించే డిజైన్లను వినియోగదారులు అన్వేషించవచ్చని తెలిపారు. ప్రదర్శన సందర్భంగా రూ.1 లక్ష లేదా అంతకంటే ఎక్కువ విలువైన వజ్రాభరణాలను కొనుగోలు చేసే ప్రతి వినియోగదారుడికి ఉచితంగా ఒక బంగారు నాణెం అందించనున్నట్లు సంస్థ వెల్లడించింది. పరిమిత కాలం మాత్రమే అందుబాటులో ఉండే ఈ ప్రత్యేక ప్రదర్శనను సందర్శించి వజ్రాభరణాల సరికొత్త కలెక్షన్‌ను వీక్షించాలని వినియోగదారులను జోయాలుక్కాస్ ఆహ్వానించింది.

ఈ నెల 4న బీజీఎంఐ హాట్ డ్రాప్

విశాఖపట్నం



ఈ నెల 4న నగరంలోని ఇన్‌ఆర్బిట్ మాల్‌లో క్రాఫ్టన్ ఇండియా బీజీఎంఐ హాట్ డ్రాప్ కార్యక్రమం జరగనుంది. ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు జరిగే ఈ ఉచిత కార్యక్రమంలో సందర్శకులకు ఆరు ప్రత్యేక అనుభవ ప్రాంతాలను ఏర్పాటు చేస్తున్నారు. హాట్ డ్రాప్ థీమ్‌తో కూడిన గోడపై చిత్రాలు వేయడం, లక్ష్యాన్ని గురిచూసే ఆట, జ్ఞాపకశక్తి పరీక్ష, ఆయుధాల శబ్దాలను గుర్తించడం, సర్వైవర్స్ అరీనాలో పోటీ పడటం, తమకు ఇష్టమైన బీజీఎంఐ పాత్రల వేషధారణలో పాల్గొనడం వంటి కార్యక్రమాలు ఉంటాయి. ప్రత్యేక ఛాయాచిత్ర ప్రాంతాలతో పాటు ప్రముఖ ఆటల సృష్టికర్తలను కలుసుకునే అవకాశం కూడా ఉంటుంది. కార్యక్రమంలో పాల్గొనే వారికి బీజీఎంఐ పోస్టర్లు, స్టిక్కర్ ప్యాక్‌లు, బొటనవేలి పట్టీలు, గుర్తింపు చిహ్నాలు వంటి బహుమతులు అందించనున్నారు. ఆటలోని గణాంకాల ఆధారంగా వ్యక్తిగతీకరించిన గుర్తింపు పట్టీని కూడా రూపొందిస్తారు. కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన వారికి పరిమిత సంఖ్యలో ప్రత్యేక బీజీఎంఐ వస్తువులు అందిస్తారు. ప్రవేశం ఉచితం. గౌహతి, వడోదర, ఇండోర్ తర్వాత హాట్ డ్రాప్ పర్యటనలో విశాఖ నాలుగో నగరంగా నిలిచింది.

మిడ్-ఎయిర్ డ్రామా!

దుబాయ్ నుండి టెల్ అవీవ్‌కు బయలుదేరిన ఫ్లైదుబాయ్ విమానంలో ఆకాశంలోనే ఊహించని విధంగా అత్యంత నాటకీయమైన, తీవ్ర భయాందోళనకరమైన సన్నివేశం చోటుచేసుకుంది. ఇస్రాయెల్ ప్రయాణికులతో నిండిన ఈ విమానాన్ని కూల్చివేసేందుకు ఓమన్ దేశానికి చెందిన కో-పైలట్ యత్నించడం సంచలనం సృష్టించింది. తీవ్ర మత తీవ్రవాద భావజాలం కలిగిన ఈ ఓమన్ పైలట్, తన తోటి పైలట్‌పై ఒక్కసారిగా దాడికి తెగబడి విమానాన్ని కిందకు దించేందుకు ప్రయత్నించాడు. అతని ఉన్మాద చర్యల కారణంగా విమానం కేవలం 30 సెకన్ల వ్యవధిలోనే ఏకంగా 14,000 అడుగుల కిందకు పడిపోయింది. అలాగే కేవలం రెండు నిమిషాల కంటే తక్కువ సమయంలో మొత్తం 17,000 అడుగుల ఎత్తు నుండి విమానం వేగంగా కిందకు దూసుకుపోవడంతో విమానంలోని ప్రయాణికులు మరణభయంతో అల్లల్లాడిపోయారుఈ భయంకరమైన సన్నివేశంలో విమాన పైలట్-ఇన్-కమాండ్, భారతీయ మూలాలున్న కెప్టెన్ స్మిత్ మచ్చర్ అసమాన ధైర్యసాహసాలు ప్రదర్శించారు. సుమారు 13 సంవత్సరాలకు పైగా కమర్షియల్ విమానయాన అనుభవం, దాదాపు 9,750 గంటల ఫ్లయింగ్ రికార్డ్ ఉన్న స్మిత్ మచ్చర్, గతంలో స్పైస్‌జెట్‌లో 11 ఏళ్ల పాటు లైన్ ట్రైనింగ్ కెప్టెన్‌గా సేవలు అందించారు. కో-పైలట్ జరిపిన రక్తసిక్తమైన దాడిలో కెప్టెన్ స్మిత్ తీవ్రంగా గాయపడి, రక్తం ఓడుతున్నప్పటికీ, ఏమాత్రం ఉపేక్షించకుండా కాక్‌పిట్ తలుపులను అన్‌లాక్ చేయడంలో విజయం సాధించారు. విమానం నిటారుగా కిందకు పడిపోతున్న క్లిష్ట సమయంలో ఆయన కాక్‌పిట్ డోర్ తెరవడమే ప్రయాణికుల ప్రాణాలను కాపాడటంలో అతిపెద్ద మలుపుగా మారింది.కాక్‌పిట్ డోర్ తెరచుకోగానే యామిన్ హయూన్ అనే ఇస్రాయెలీ ప్రయాణికుడు తక్షణమే స్పందించి కాక్‌పిట్‌లోకి దూసుకెళ్లాడు. దాడికి తెగబడిన ఓమన్ పైలట్‌ను విమాన నియంత్రణ ప్యానెల్ నుండి వెనక్కి లాగి, ఇతర ప్రయాణికులు మరియు సిబ్బంది సాయంతో అతనిని పూర్తిగా లొంగదీసుకున్నాడు. అనంతరం విమానాన్ని సురక్షితంగా రక్షించి, సౌదీ అరేబియాలో అత్యవసర ల్యాండింగ్ చేశారు. ఈ భయంకర సంఘటనలో కాక్‌పిట్ మొత్తం రక్తసిక్తమైనట్లు ప్రయాణికులు తెలిపారు. ఈ విపత్తు సమయంలో భారతీయ కెప్టెన్ స్మిత్ మచ్చర్ ప్రదర్శించిన అద్భుతమైన సమయస్ఫూర్తి, సాహసాన్ని ఇస్రాయెల్ ప్రధాని బె?ంజమిన్ నెతన్యాహు స్వయంగా కొనియాడారు.సహచర పైలట్ల కథనం ప్రకారం, దాడికి పాల్పడిన ఓమన్ పైలట్ ఎనిమిది నెలల క్రితమే ఫ్లైదుబాయ్‌లో చేరాడని, ఆయన తీవ్ర మత తీవ్రవాద భావాలు కలిగిన వ్యక్తి అని వెల్లడైంది. రోజులో విపరీతంగా ప్రార్థనలు చేయడం, మహిళలకు కనీసం షేక్ హ్యాండ్ ఇవ్వడానికి కూడా నిరాకరించడం వంటి ప్రవర్తన అతనిలో కనిపించేదని తెలిసింది. ఈ ఊహించని విమాన ప్రమాద ముప్పుపై ప్రస్తుతం సమగ్ర దర్యాప్తు జరుగుతుండగా, ఫ్లైదుబాయ్ సంస్థ ఇస్రాయెల్‌కు రాకపోకలు సాగించే తన విమాన సేవలను తాత్కాలికంగా నిలిపివేసింది.ఫ్లై దుబాయ్ కంపెనీలో విమానాన్ని నడుపుతున్న భారతీయ పైలట్ స్మిత్ మచ్చార్ మీద ఒమన్ దేశానికి చెందిన కో పైలట్ దాడి చేసి కత్తితో అతడిని పొడిచాడు. అతడు తీవ్రంగా గాయపరుస్తున్నప్పటికీ పైలట్ ఏమాత్రం వెనుకడుగు వేయలేదు. పైగా విమానాన్ని ముందుకు పోనిచ్చాడు. విమానం తలకిందులు అవుతున్నప్పటికీ అతడు ఏమాత్రం వెనకడుగు వేయలేదు. తన ప్రాణాలు పోతాయని తెలిసినప్పటికీ కూడా తోటి ప్రయాణికుల ప్రాణాలను అతని కాపాడాడు.విమానం తలకిందులు కావడం.. అప్పటికే అది సౌదీ అరేబియా గగన తలం మీద ఉంది. అప్పటికే దాని నుంచి అత్యవసర పరిస్థితి అంటూ తబుక్ విమానాశ్రయానికి సంకేతం వచ్చింది. మరికొద్ది నిమిషాల్లోనే కోడ్ 7500 (హైజాక్) అంటూ సందేశం అందింది. ఈ సందేశంతో తీవ్ర కలకలం నెలకొంది. ఇజ్రాయిల్ దేశం మీద ఉగ్రదాడి జరుగుతుందని ప్రచారం మొదలైంది. పైగా విమానంలో ప్రయాణిస్తున్న మెజారిటీ ప్రయాణికులు ఇజ్రాయిల్ దేశానికి చెందినవారు. దీంతో ఇజ్రాయిల్ ప్రధానమంత్రి.. రక్షణ మంత్రి వెంటనే సమావేశం ఏర్పాటు చేశారు. ఇజ్రాయిల్ యుద్ధ విమానాలను రంగంలోకి దింపారు.అప్పటికే కత్తితో దాడి చేసిన కో పైలట్ ను పైలట్.. ప్రయాణికులు పట్టుకున్నారు. తీవ్ర గాయాలైన పైలెట్ కు విమానంలో ఉన్న ఒక వైద్యుడు ప్రాథమికంగా చికిత్స అందించారు. ఆ తర్వాత ప్రయాణికులలో ఇద్దరు ఇతర విమాన పైలట్ల సహాయంతో అభిమానాన్ని కిందికి మళ్లించారు. ఆ తర్వాత కోడ్ ను హైజాక్ నుంచి సాధారణ అత్యవసర పరిస్థితి కి మార్చారు.పైలట్ పై దాడికి పాల్పడి.. విమానాన్ని కూల్చాలి అనుకున్న ఒమన్ కో పైలెట్ విషయంలో అనేక సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. కొన్ని సంవత్సరాలుగా ఇజ్రాయిల్, ఒమన్ దేశాల మధ్య అంతగా సంబంధాలు లేవు. దీనికి తోడు అరబ్, గల్ఫ్ దేశాల నుంచి ఇజ్రాయిల్ వచ్చే విమానాల మీద తీవ్రస్థాయిలో పరిశీలన ఉంటుంది. అలాంటిది ఇజ్రాయిల్ దేశానికి వెళ్లే విమానంలో పైలట్ గా ఒమన్ జాతీయుడిని ఎలా అనుమతించారు అనే విషయం మీద అనేక రకాల సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఇజ్రాయిల్ రవాణా శాఖ మంత్రి కూడా ఈ వే సందేహాలను వ్యక్తం చేశారు. విమానం కూల్చడానికి ముందుగానే ప్రణాళిక రూపొందించారని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. అయితే ఒమన్ కో పైలట్ అసలు ఉద్దేశం ఏంటి.. అతని ప్రణాళిక ఏంటి.. దాడికి ఎందుకు ప్రయత్నించాడు అనే అంశాల మీద ఇంతవరకు క్లారిటీ లేదు. ఇతర వెనుక ఎవరైనా ఉన్నారా.. అందుకోసమే ఇదంతా చేశాడా అనే కోణంలో దర్యాప్తు జరుగుతోంది.పైలట్ మీద కత్తి దాడి జరిగిన తర్వాత విమానం తలకిందులుగా ప్రయాణించడం మొదలుపెట్టింది. కేవలం 29 సెకండ్ల కాలంలో 31 వేల అడుగుల ఎత్తులో ప్రయాణిస్తున్న విమానం ఏకంగా 17 అడుగులకు దిగింది. దాదాపు 14 అడుగుల మేర నిలువుగా కిందికి దిగింది. ఆ తర్వాత 19 వేల అడుగులకు చేరుకుంది. ప్రయాణ మార్గాన్ని పూర్తిగా మార్చుకుంది. జోర్డాన్ సరిహద్దుల సమీపంలో అసాధారణమైన రీతిలో తిరిగింది. మళ్లీ వెనక్కి వెళ్ళింది. గంట తర్వాత సౌదీ అరేబియాలోని తబూకు విమానాశ్రయంలో ల్యాండ్ అయింది.

ఆహార సంక్షోభం ముప్పు



న్యూయార్క్ ఏషియా సొసైటీ వేదిక మీద భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ రానున్న ఆహార సంక్షోభం గురించి చేసిన హెచ్చరికను ఏదో సాధారణ వ్యాఖ్యగా తీసుకోలేం. ఆయన చేసిన హెచ్చరిక కొత్తగా పుట్టుకు వచ్చింది కాదు. కొన్నాళ్లుగా దానిపై దేశంలో చర్చ నలుగుతూనే ఉన్నది. గోడదెబ్బ, చెంపదెబ్బ అన్నట్టుగా అంతర్జాతీయ సమస్యలు ఓ వైపు, పర్యావరణ క్షీణత మరోవైపు నుంచి తరుముతున్నాయి. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం, ఇరాన్‌పై అమెరికా యుద్ధం, అంతర్జాతీయంగా చమురు, ఎరువుల సంక్షోభాన్ని తీవ్రతరం చేస్తున్నాయి. అమెరికా విధిస్తున్న పరిహార ఆంక్షలు దీనికి ఆజ్యం పోస్తున్నాయి. యుద్ధాలు, సరఫరా వ్యవస్థల్లో అంతరాయాలు, ఇంధన ధరల అస్థిరత ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కుదిపేస్తున్నాయి. ఈ సంక్షోభం భారత్ మీద ఎంత ప్రభావం చూపుతున్నదో నిర్ణయించేది మన దేశీయ సంసిద్ధత, విధానాల పటిష్టత, రాజకీయ విజ్ఞత మాత్రమే. దిగుమతులపై అధికంగా ఆధారపడటం భారత ఆర్థిక వ్యవస్థ ప్రధాన బలహీనత. ఇంధనం, ఎరువులు, ముడిసరుకుల విషయంలో విదేశీ మార్కెట్లపై ఆధారపడటం వల్ల అంతర్జాతీయ ధరలు పెరిగితే దేశీయంగా ఆ భారం మోయక తప్పదు. మరోవైపు సబ్సిడీలు పెంచాల్సి రావడం సహజం, ఆర్థిక లోటు పెరుగుదల, పరిమిత ఆదాయ వనరులు ప్రభుత్వ ఆర్థిక నిర్వహణ సామర్థ్యానికి పరీక్షలుగా మారాయి.


ఇక ఎల్ నినో ప్రభావం ఈ సవాళ్లకు మరొక అదనపు ముప్పును జోడిస్తున్నది. సాధారణంగా ఎల్ నినో వల్ల వర్షపాతం తగ్గిపోయి, ఉష్ణోగ్రతలు పెరిగిపోతాయి. దీనివల్ల పంటలు దెబ్బతిని ఆహార కొరత ఏర్పడుతుంది. మహారాష్ట్రలో ఇప్పటికే కరువు పరిస్థితులు ఏర్పడ్డాయి. మన రాష్ట్రంలో ఈ ఏడాది మొత్తంగా చూస్తే వర్షపాతం సాధారణ స్థాయిలో ఉన్నట్టు చెప్తున్నప్పటికీ, 18 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైంది. ఇటీవలి వర్షపాతం గణాంకాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఆగస్టులోనే సుమారు 38 శాతం వరకు వర్షాభావం నమోదవడం, మొత్తం మాన్సూన్ కూడా సాధారణ స్థాయికి తగ్గిపోవడం పరిస్థితి తీవ్రతను స్పష్టంగా తెలియజేస్తున్నాయి.

ఎల్ నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా ఏర్పడిన వర్షాభావంలో భాగమే ఇది. దేశం మొత్తం గత దశాబ్దంలోనే కనిష్ఠ వర్షపాతం నమోదవడం ఈ సమస్యకు స్పష్టమైన సూచన. నాగార్జునసాగర్ వంటి కీలక జలాశయాలు ఇప్పటికీ పూర్తిస్థాయిలో నిండలేదు. ప్రవాహాలు అస్థిరంగా ఉండటం వల్ల భవిష్యత్ నీటి లభ్యతపై స్పష్టత లేదు. ముఖ్యంగా సెప్టెంబర్‌అక్టోబర్‌లో వచ్చే ప్రవాహాలపై ఆధారపడే పరిస్థితి గతంలో ఉన్నా, ఇప్పుడు వర్షాల అస్థిరత కారణంగా ఆ నమ్మకం తగ్గిపోయింది. దేశవ్యాప్తంగా పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉన్నది. దక్షిణ భారత రాష్ట్రాల రిజర్వాయర్లు కేవలం సుమారు 50 శాతం సామర్థ్యంతోనే ఉండటం సమస్య తీవ్రతను తెలియజేస్తున్నది.

రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కార్ అందుబాటులో ఉన్న ప్రాజెక్టులను పడావుపెట్టి, పెండింగ్ ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేయడం వల్ల సాగునీరు తగిన స్థాయిలో అందుబాటులోకి రావడం లేదు. భూగర్భ నీటిమట్టాలు భారీగా పడిపోతున్నాయి. మరోవైపు పంట పెట్టుబడుల సమస్య వేధిస్తున్నది. ఇవన్నీ వెరసి సాగును సంకటంలో పడేస్తున్నాయి. ప్రస్తుతం దేశంలో ఆహార కొరత లేకపోయినప్పటికీ, వ్యవసాయ ఉత్పత్తుల ధరల పెరుగుదల సమస్య మాత్రం తీవ్రంగానే ఉంటుందని ఆర్థిక నిపుణులు అంటున్నారు.

బహిరంగ మార్కెట్లో ఈసరికే రూ.70 దాటిన బియ్యం ధరలు సెంచరీ కొడతాయనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. మరోవైపు ఉల్లిగడ్డల ధరలు కూడా కిలో రూ.60 దాటిపోయాయి. ఇక కూరగాయలు, ఇతర సరుకుల ధరలు సామాన్యులకు మోయరాని భారంగా పరిణమిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాబోయే రోజుల్లో ఆహార సమస్య తీవ్రరూపం దాల్చవచ్చని విదేశాంగమంత్రి చేసిన హెచ్చరిక ప్రాముఖ్యం సంతరించుకున్నది. ధరల సమస్య స్థానంలో తీవ్రమైన ఆహార కొరత ఎదురుకాకుండా చూడటం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు పెనుసవాల్‌గా ఉంటుంది. తక్షణం వ్యవసాయరంగ సమస్యలపై అవి సమన్వయంతో దిద్దుబాటు చర్యలు తీసుకోవాలి. అంతకన్నా ముందు ధరల తగ్గుదలకు చొరవ తీసుకోవాల్సి ఉన్నదని చెప్పక తప్పదు.

నాలుగు స్తంభాలూ కూలుతున్నాయి!



మహాత్మాగాంధీ తన జీవితంలో చివరి మూడు దశాబ్దాలు బ్రిటిష్ వలసపాలన నుంచి భారత్‌కు స్వాతంత్ర్యం సాధించడంలో గడిపారు. 'స్వతంత్ర భారతదేశం ఎలా ఉండాలి?' అన్నదానిపై ఆయన తన భావనలను ఆ కాలంలో అరుదుగా రాశారు, మాట్లాడారు. అయితే 1922 మార్చిలో స్వరాజ్‌కు ఆయన ఒక చిన్న, సంక్షిప్త నిర్వచనాన్ని ప్రతిపాదించారు. నేడు మనం మళ్లీ దానిని గుర్తు చేసుకుని, స్ఫూర్తి పొందవలసిన అవసరమున్నది. అస్పృశ్యత నిర్మూలన, ఖద్దర్ ఉత్పత్తి, హిందూ--ముస్లిం సమైక్యత, అహింసా సాధన అనేవి ఆయన ఆశించిన స్వరాజ్‌కు పునాదులుగా ఉన్నాయి. స్వరాజ్ సౌధం ఎల్లప్పుడూ ఆధారపడి ఉండే నాలుగు మూల స్తంభాల్లో ఒక్కదాన్ని తొలగించినా మొత్తం సౌధమంతా కూలిపోతుంది.

స్వరాజ్ స్వరూప స్వభావాలకు ప్రాతిపదికలు అయిన ఆ నాలుగు ముఖ్య అంశాలను మరింతగా వివరంగా చూద్దాం. 'అస్పృశ్యత నిర్మూలన'ను విశాలార్థంలో సామాజిక న్యాయంగా నేడు మనం భావించవచ్చు. కులపరమైన అసమానతలే కాకుండా జెండర్ అసమానతలను సమూలంగా తొలగించడమే సామాజిక న్యాయం. కాంగ్రెస్‌లోని ఇతర సవర్ణ నాయకులు నెహ్రూ, పటేల్, బోస్ వలే కాకుండా భారత స్వాతంత్ర్య సాధనకు అస్పృశ్యతా దురాచారం ఎలా అవరోధమవుతుందో గాంధీకి నిశిత, సమగ్ర అవగాహన ఉంది. అస్పృశ్యత ఒక 'పాపం' అని, దానిని పాటిస్తున్నవారు 'హిందూ ధర్మ వినాశకులు' అని ఆయన నిరసించారు. మహిళా విముక్తి విషయమై కూడా గాంధీ పరిపూర్ణ శ్రద్ధ వహించారు. 1917లో వెలువరించిన ఒక ప్రసంగంలో గాంధీ ఇలా అన్నారు: 'మహిళలు పురుషుల సహవాసులు, మానసిక సామర్థ్యాలలో సమానులు. పురుషుని సమస్త కార్యకలాపాలలో పాల్గొనే హక్కు ఆమెకు ఉన్నది. స్వేచ్ఛా స్వాతంత్ర్యాల విషయంలో పురుషునికి ఎంత హక్కు ఉన్నదో మహిళకూ అంతే సమాన హక్కు ఉన్నది'. వలస పాలకులకు వ్యతిరేకంగా గాంధీ నిర్వహించిన సత్యాగ్రహాలు అన్నిటిలోనూ మహిళలు కీలకపాత్ర వహించారు. గాంధీ మహాత్ముని సాంఘిక సంస్కరణల అజెండాకు పరిమితులు ఉన్నాయి. అస్పృశ్యులను గౌరవప్రదంగా పిలిచేందుకై 'హరిజన్' అనే పదాన్ని ఆయన సృష్టించారు. ఇప్పుడు దాని స్థానంలో 'దళిత్' అనే పదం వాడుకలోకి రావడం ఒక వివేకవంతమైన కాలానుగుణ్య మార్పు. సంప్రదాయ ఆర్థిక వ్యవస్థలో మహిళలు పాల్గొనడంపై గాంధీ అభిప్రాయాలు సందిగ్ధ స్వభావంతో ఉండేవి. అయినప్పటికీ కుల దౌష్ట్యాలను, జెండర్ వివక్షను వ్యతిరేకించడంలో, వాటిని రూపుమాపే కృషిలో తన సమకాలీన జాతీయవాదులు అందరికంటే ఆయన చాలా అభ్యుదయాత్మకంగా ముందుండేవారు. ఖద్దర్ తయారీకి మహాత్ముడు ఇచ్చిన విశేష ప్రాధాన్యం గురించి చూద్దాం. గాంధీ కాలంలోనూ, ఆనాటి నుంచి ఈనాటి దాకా ఖద్దర్ తయారీ అంటే చులకనభావం వ్యక్తమవుతోంది. ఖద్దర్‌ను అంగీకరించడం అంటే ఆర్థికాభివృద్ధిని పెంపొందించే పారిశ్రామిక ఆర్థిక కార్యకలాపాలను తిరస్కరించడంగా పరిగణన అవుతుంది. అయితే స్వతంత్ర భారతదేశం ప్రస్తుతం అనుసరిస్తున్న ఆర్థికాభివృద్ధి బాట అనేక సమస్యల (సంపద కేంద్రీకరణ, గౌరవప్రద, అర్థవంతమైన ఉపాధి అవకాశాల కొరత, పర్యావరణ విధ్వంసం)కు కారణమవుతోంది. ఈ నేపథ్యంలో గాంధీ ఆర్థిక భావాలకు ఇప్పటికీ కొంత ప్రాధాన్యత ఉంది. ఆయన నిర్వహించిన ఖద్దర్ ఉద్యమం శ్రమ గౌరవానికి, స్థానిక స్వావలంబనకు ప్రాధాన్యమిచ్చింది. ప్రకృతిని, సహజ వనరులను విచక్షణాయుతంగా ఉపయోగించుకోవడం ఎంత ముఖ్యమో ఆయన తరచూ రాస్తుండేవారు. అనేక విధాలుగా గాంధీ ముందస్తు పర్యావరణవాది. వాయు, జల కాలుష్యాన్ని, భూసార క్షీణతను అరికట్టేందుకు, వాతావరణ మార్పును సమర్థంగా ఎదుర్కొనేందుకు గాంధీ భావాలు, ఆచరణలు మనకు ఎంతైనా తోడ్పడగలవు.

గాంధీ స్వరాజ్‌కు మూడో మూల స్తంభం 'హిందూ--ముస్లిం ఐక్యత'. జాతి నిర్మాణంలో మత సామరస్యం ప్రాధాన్యాన్ని ఆయన దక్షిణాఫ్రికాలో తన జీవితానుభవాల నుంచి గ్రహించారు. బొంబాయిలోనే న్యాయవాదిగా గాంధీ రాణించి ఉంటే ఆయన క్లయింట్‌లు, స్నేహితులు దాదాపుగా అందరూ హిందువులు అయివుండేవారు. అయితే బొంబాయిలోను, రాజ్‌కోట్‌లోను న్యాయవాదిగా ఆయన విఫలమయ్యారు. గుజరాతీ ముస్లిం వ్యాపారస్థుల మధ్య వివాదాన్ని పరిష్కరించేందుకు ఆయన దక్షిణాఫ్రికాలోని దర్బన్ నగరానికి వెళ్లారు. అక్కడ ఆయన ఒక సాంఘిక సేవాకర్తగా పరిణమించారు. ప్రవాస భారతీయుల సమస్యల పరిష్కారానికి ఆయన విశేష కృషి చేశారు. ఈ కృషిలో పార్సీలు, ముస్లింలు, తమిళులు ఆయనకు సంపూర్ణ సహాయ సహకారాలు అందించారు. దృఢమైన జాతీయవాదాన్ని అభివృద్ధిపరచడంలో మతపరమైన, భాషాపరమైన బహుళత్వాన్ని గౌరవించడం ఎంత ముఖ్యమో గాంధీ తెలుసుకున్నారు. 1908లో జోహాన్స్‌బర్గ్ జైలులో ఉన్న సమయంలో ఆయన ఇలా రాశారు: 'దక్షిణాఫ్రికాలో శ్వేతజాతి పాలకులకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న భారతీయులలో హిందువులు, ముస్లింలు, పార్సీలు, క్రైస్తవులు, బెంగాలీలు, గుజరాతీలు, పంజాబీలు అనే తరతమ తేడాలు లేవు. మేమందరమూ భారతీయులమే. భారతదేశం కోసం పోరాడుతున్నాం'. జైలు నుంచి విడుదలైన తరువాత జోహాన్స్‌బర్గ్‌లోని భారతీయుల నుద్దేశించి గాంధీ మాట్లాడుతూ, 'రెండు కళ్లు (హిందువులు, ముస్లింలు) నిరపాయంగా ఉంటే మీరు వర్ధిల్లుతారు... ఉభయ మతాలవారు సమైక్యంగా ఉంటే భారత్‌కు మీరే పాలకులు అవుతారు' అని ఉద్ఘాటించారు. భారత్‌కు తిరిగివచ్చిన తరువాత ఆయన అవే సునిశ్చిత విశ్వాసాలతో పనిచేశారు. మత సామరస్యానికి ఎంతగానో కృషి చేసినా దేశ విభజనను నివారించడంలో గాంధీ విఫలమయ్యారు. 1947 ఆగస్టు తరువాత భారతదేశంలో ఉండిపోయిన ముస్లింలకు హిందువులతో పాటు సమాన హక్కులు లభించేందుకు ఆయన కృతనిశ్చయంతో పనిచేశారు. మైనారిటీల హక్కులను సంరక్షించేందుకై 1947 సెప్టెంబర్‌లో కలకత్తాలోను, 1948 జనవరిలో న్యూఢిల్లీలోను ఆయన నిరాహారదీక్షలు నిర్వహించారు. ఈ రెండు దీక్షల మధ్య కాలంలో 1947 నవంబర్ 15న న్యూఢిల్లీలో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ మౌలిక లక్ష్యాలకు పార్టీ సభ్యులందరూ కట్టుబడి ఉండాలని విజ్ఞప్తి చేశారు. హిందూ--ముస్లిం ఐక్యతకు కృషి చేయడం కాంగ్రెస్ స్వతస్సిద్ధ స్వభావమని, గత ఆరు దశాబ్దాలుగా అందుకు కాంగ్రెస్ చేస్తున్న కృషిని మరింత సమగ్రంగా కొనసాగించాలని ఆయన కోరారు. గాంధీ స్వరాజ్ నాలుగో మూల స్తంభమైన అహింసా సాధన గురించి చూద్దాం. గాంధీ అహింసా ప్రవక్త. ప్రజా జీవితంలో అహింసా పద్ధతులకు ఆయన ప్రాధాన్యమిచ్చారు. తన తుది శ్వాస వరకు అహింసను మనసా వాచా కర్మణా ఆచరించారు. దక్షిణాఫ్రికాలోని భారతీయుల హక్కుల కోసం చేస్తున్న కృషిలో భాగంగా గాంధీ 1909 వేసవికాలంలో లండన్ నగరానికి వెళ్లారు. ఆ రోజుల్లోనే భారతీయ యువకుడు ఒకరు ఒక బ్రిటిష్ ఉన్నతాధికారిని తుపాకీ కాల్పులతో హతమార్చాడు. ఈ ఘటన గాంధీని భీతావహుడిని చేసింది. ఆయన ఇలా రాశారు: ఇటువంటి హింసాత్మక చర్యలతో బ్రిటిష్ వారు భారత్ నుంచి నిష్క్రమించినా వారి స్థానంలో దేశ పాలకులు అయ్యేది ఎవరు? ఈ ప్రశ్నకు ఏకైక సమాధానం: హంతకులు. ఆ హంతకులు శ్వేత జాతీయులైనా లేక నల్ల జాతీయులైనా వారి పాలన నుంచి భారత్ ప్రయోజనం పొందదు, పొందలేదు'. లండన్ ఘటన సంభవించిన రెండు దశాబ్దాల అనంతరం భారత్‌లో యువ విప్లవకారుల 'హింసారాధన'ను గాంధీ ఎదుర్కోవలసి వచ్చింది. శ్వేత జాతీయులైన అధికారులను హతమార్చడమే దేశం నుంచి బ్రిటిష్ వారిని వెళ్లగొట్టేందుకు ఏకైక మార్గమని ఆ యువ విప్లవకారులు విశ్వసించారు. 'ఒంటరిగా పాల్పడే సాహసోపేత చర్యల వల్ల ఒక పరాధీన దేశం స్వాతంత్ర్యం పొందలేదని' ఆ యువ విప్లవకారులకు గాంధీ నచ్చచెప్పారు. స్వేచ్ఛా మందిరం నిర్మాణానికి వేలాది స్త్రీ పురుషుల, యువజనుల, వృద్ధుల సంఘటిత నిర్మాణాత్మక ప్రయత్నాలు అవసరమని ఆయన అన్నారు. దేశ స్వాతంత్ర్యం లేదా సమాజంలో మార్పు కోసం ప్రాణాలు అర్పించడానికి వెనుకాడని యువ విప్లవకారుల ధైర్య సాహసాలను ఆయన అంగీకరించారు. అయితే సాయుధ విప్లవాలతో ప్రపంచం విసుగు చెందిందని గాంధీ అభిప్రాయపడ్డారు. అహింసాయుత పోరాటం ద్వారా ప్రభావవంతమైన మార్పును సాధించవచ్చని మహాత్ముడు అన్నారు. స్వరాజ్‌కు గాంధీ విశిష్ట నిర్వచనమిచ్చి వంద సంవత్సరాలకు పైగా గడచిపోయింది. మరి ప్రస్తుత కాలంలో ఆ భావన, నాలుగు మూలస్తంభాలు ఎలా ఉన్నాయి? స్వతంత్ర భారతదేశ రాజ్య వ్యవస్థ విధులు, బాధ్యతల విషయమై గాంధీ స్వయంగా ఎప్పుడూ ఆలోచించలేదు. అయితే పాలనా పద్ధతులను విమర్శించేవారిని సంవత్సరాల తరబడి జైలులో ఉంచడానికి ప్రస్తుతం అమలులో ఉన్న శిక్షార్హమైన చట్టాలు, వాటి దుర్వినియోగంపై ఆయన తప్పకుండా దిగ్భ్రాంతి చెందేవారు. దేశ ప్రజల్లో మతపరమైన విభేదాలు సృష్టించేలా ఉంటున్న హోంమంత్రి, ప్రధానమంత్రి, అసోం, యూపీ, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాల ముఖ్యమంత్రుల ప్రసంగాలు, వ్యాఖ్యలకు ఆయన తప్పకుండా భీతావహుడు అయ్యేవారు. పూర్తిగా అహింసాయుత పద్ధతులకు కట్టుబడి సూత్రబద్ధంగా సాగుతున్న ఉద్యమాలు, మరీ ముఖ్యంగా పౌరసత్వ సవరణ చట్ట వ్యతిరేక నిరసనలు, రైతుల పోరాటాలు, పర్యావరణ ఉద్యమాలు, ఇటీవలి విద్యార్థుల ఆందోళనలను ఆయన తప్పక అభినందించేవారు. దళితులు, మహిళలు, మైనారిటీలకు సమానహక్కులు, సమత్వ, సుస్థిర ఆర్థికాభివృద్ధి నమూనా, మనసా, వాచా, కర్మణా అహింసను ఆచరించడం-- స్వేచ్ఛకు ఇవే అత్యంత ఆవశ్యకమైన నిబంధనలుగా మిగిలి ఉన్నాయి. వర్తమాన భారతదేశంలో గాంధీ స్వరాజ్ నాలుగు మూల స్తంభాలలో ప్రతి ఒక్కటీ బలహీనపడిపోయింది. ప్రభుత్వ చర్యల వల్లే కాకుండా అనేక సందర్భాలలో పౌరుల చర్యల వల్ల కూడా మరింత బలహీనపడ్డాయి. గాంధీ ఊహించిన స్వరాజ్ నిర్మాణం ఇంకా కూలిపోనప్పటికీ అది ఎంత మాత్రమూ బలంగా, స్థిరంగా లేదు.

ఆ ఎన్నికలన్నీ చట్ట విరుద్ధమే

'సర్' ప్రక్రియ కేంద్రంగా దేశంలో ప్రస్తుతం రాజకీయ పరిణామాలు హాట్ టాపిక్‌గా మారాయి. కేంద్ర ఎన్నికల సంఘంలో సభ్యుల మధ్య అభిప్రాయ భేదాల అంశం, సర్ ప్రక్రియలో అక్రమాల ఆరోపణల నేపథ్యంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తాజాగా సంచలన ఆరోపణలు చేశారు. దేశంలో ప్రస్తుతం కొనసాగుతున్న ఎన్నికల ప్రక్రియపై మాట్లాడిన ఆయన– దేశంలో అన్ని ఎన్నికలు చట్టవిరుద్ధంగానే జరిగాయని ఆరోపించారు. ఈ క్రమంలో లోక్‌సభతో పాటుగా అన్ని రాష్ట్రాల అసెంబ్లీలను రద్దు చేసి మళ్లీ కొత్తగా ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఇదే సమయంలో ఈవీఎం పద్ధతిలో కాకుండా ఇప్పుడు బ్యాలెట్ పేపర్ విధానంలో ఎన్నికలు నిర్వహించాలని కోరారు. శనివారం రోజు కర్ణాటక కలబురగిలో వితేకరుల సమావేశంలో కాంగ్రెస్ ప్రెసిడెంట్ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ సహా కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రాష్ట్రాల ముఖ్యమంత్రుల ఎన్నికలపైనా ఆయన ప్రశ్నలు లేవనెత్తారు. 'ప్రస్తుతం దేశమంతా చట్టవిరుద్ధంగా నిర్వహించే ఎన్నికల ఆధారంగానే నడుస్తోంది. మోదీ అక్రమంగా ఎన్నికైన ప్రధాని. అమిత్ షా చట్టవిరుద్ధంగానే ఎన్నికైన మంత్రి. ఎక్కడ ఎన్నికైన ముఖ్యమంత్రులైనా సరే, వారంతా ఇలానే చట్టవిరుద్ధంగా ఎన్నికైనవారే. వారందరినీ తొలగించి మళ్లీ ఎన్నికలు నిర్వహించాలి. ఆ ఎన్నికలను బ్యాలెట్ పేపర్ల ద్వారా నిర్వహించాలి.' దేశంలో ఎక్కడ ఎన్నికలు నిర్వహించినా ఈవీఎంల దుర్వినియోగం తీవ్ర స్థాయిలో జరుగుతుందని ఖర్గే మండిపడ్డారు. అధికార పార్టీకి చెందిన నేతలే స్వయంగా ఇది చెబుతున్నారని అన్నారు. అధికార బీజేపీ, ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు వార్డులు, పంచాయతీలు, గ్రామాలకు వెళ్లి ఎక్కువగా పేదలు, గిరిజనులు, దళితులు, మైనార్టీల ఓట్లను



కావాలని తొలగిస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. సెప్టెంబర్ 30న జరిగిన ఇండియా కూటమి సమావేశాన్ని కూడా ఖర్గే ఈ సందర్భంగా ప్రస్తావించారు. అక్కడ దాదాపు 20 పార్టీల ప్రతినిధులు, ఆయా పార్టీలకు చెందిన లీగల్ సెల్ ప్రతినిధులు పాల్గొనగా, సర్ ప్రక్రియ దేశానికి నష్టం కలిగించేలా సాగుతోందని ప్రతి ఒక్కరూ అంగీకరించినట్లు చెప్పారు.

సర్ ప్రక్రియలో పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నాయని, ఇది ప్రజాస్వామ్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తోందని ఖర్గే వ్యాఖ్యానించారు. ప్రతి పోలింగ్ బూత్‌కు దాదాపు 500 ఓట్ల వరకు తొలగిస్తూ, తమకు అనుకూలమైన వారి పేర్లను కూడా చేరుస్తున్నారని ఖర్గే విమర్శించారు. ఇలా జరిగితే అది నిష్పక్షపాతంగా నిర్వహించిన ఎన్నిక ఎలా అవుతుందని ఖర్గే ప్రశ్నించారు. గతంలో ప్రధానులుగా పనిచేసిన జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి, పీవీ నరసింహారావు, రాజీవ్ గాంధీ కూడా ప్రజాస్వామ్యంలో ఇలాంటి చర్యలకు ఎన్నడూ పాల్పడలేదని చెప్పుకొచ్చారు. ఈ నేపథ్యంలోనే దేశంలో ఎన్నికల ప్రక్రియ, సర్ ప్రక్రియపై ప్రతిపక్షాల ఆందోళనలు కొనసాగుతాయని ఖర్గే తెలిపారు. అక్టోబర్ 6న దిల్లీలో ప్రతిపక్ష పార్టీల ఎంపీలు ఎన్నికల సంఘం కార్యాలయానికి ర్యాలీ నిర్వహిస్తారని స్పష్టం చేశారు. ప్రజలకు అవగాహన కల్పించడానికి, ప్రతి 3-4 రోజులకు ఓసారి ప్రచారాలు, నిరసనలు నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు. 2023లో ప్రవేశపెట్టిన ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్లు నియామక చట్టంపైనా ఖర్గే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల కమిషనర్ల ఎంపిక కమిటీ నుంచి భారత ప్రధాన న్యాయమూర్తిని (జజీ×) తొలగించి ఆ స్థానంలో కేంద్ర మంత్రిని చేర్చడం ద్వారా తమకు అనుకూలమైన వ్యక్తులనే నియమించుకుంటున్నారని విమర్శించారు.

జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయడమే తెలివైన పని: పి. చిదంబరం

ఇక సర్ ప్రక్రియలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్ చుట్టూ వివాదం మరింత ముదురుతోంది. ఈ క్రమంలో ఆయన రాజీనామా చేయడం మినహా మరో మార్గం లేదని కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి పి. చిదంబరం అన్నారు. ప్రతిపక్షాల ఒత్తిడి కారణంగా సీఈసీ ఏదో ఒక రోజు వైదొలగాల్సిందేనని, కాబట్టి తక్షణమే రాజీనామా చేయడమే తెలివైన నిర్ణయం అని స్పష్టం చేశారు. లేకపోతే తమ నిరసనలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. సర్ నిర్వహణలో ఎన్నికల కమిషనర్లకు చట్టవిరుద్ధమైన ఆదేశాలు ఇచ్చారని చిదంబరం మండిపడ్డారు. ప్రస్తుతం సీఈసీ రాజీనామాను డిమాండ్ చేస్తున్నామని, ఇతర కమిషనర్ల పాత్రపై అనుమానాలు వచ్చినా, ఆధారాలు లభించినా వారి రాజీనామాపై కూడా పోరాటం చేస్తామని తెలిపారు.

వాయుసేనకు ప్రతి ఏటా 36-40 విమానాలు అవసరం

దేశ సైనిక బలం విషయంలో వాయుసేన చాలా కీలకమని భారత వైమానికదళ అధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ తెలిపారు. దేశానికి ప్రతి ఏటా 36-40 విమానాలు అవసరమని అన్నారు. ప్రణాళిక ప్రకారం పనులు జరిగితే ఈ ఆర్థిక సంవత్సరంలోనే మల్టీరోల్ ఫైటర్ జెట్ ఒప్పందం ఖరారు కావొచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ధరల చర్చలు, ఇతర కీలక అంశాలపై ప్రస్తుతం చర్చలు జరుగుతున్నాయని వివరించారు. అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రోగ్రామ్‌లో జాప్యం జరిగితే వైమానిక దళం మరో ప్లాట్‌ఫామ్‌ను కొనుగోలు చేయాల్సి రావొచ్చని అభిప్రాయపడ్డారు. దిల్లీలో జరిగిన ఐఏఎఫ్ వార్షిక మీడియా సమావేశంలో ఏపీ ఏపీ సింగ్ ఈ వ్యాఖ్యలు చేశారు. "అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ ఐదో తరం ఫైటర్ ప్రోగ్రామ్‌లో జాప్యం జరిగితే మనం ఇతర ప్రత్యామ్నాయాలకు మళ్లాల్సి ఉంటుంది. రష్యా సు-57ను ప్రతిపాదించింది. కానీ దానిపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. సకాలంలో విమానాల అప్పగింత, కార్యాచరణ సామర్థ్యాన్ని నిర్ధరించడానికి అన్ని ప్రధాన విమాన ప్రోగ్రామ్‌లను 'సమగ్ర దేశ విధానం' ద్వారా చేపట్టాల్సిన అవసరం ఉంది. వాయుసేన వద్ద ఉన్న విమానాల సంఖ్యను పెంచుకోవాలనుకుంటున్నాం. ఐఏఎఫ్‌ను ఆధునీకరిస్తాం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ద్వారా భారత వైమానిక దళాన్ని బలోపేతం చేస్తాం. ఏఐ ఆధారిత వాయుసేన ఉండాలి. మొత్తం పోరాట సంసిద్ధతకు రక్షణ రంగంలో స్వయం సమృద్ధి చాలా కీలకం"

స్మిత్ మచ్చర్‌పై ప్రశంసలు

ఫ్లైదుబాయ్ హీరో కెప్టెన్ స్మిత్ మచ్చర్‌పై ఏపీ సింగ్



ప్రశంసలు కురిపించారు. విమానంలో స్మిత్ మచ్చర్ అసాధారణమైన శారీరక, మానసిక ధైర్యాన్ని ప్రదర్శించారని కొనియాడారు. ప్రత్యేక డ్రోన్ దళాన్ని ఏర్పాటు చేయాలని తాము ఇంకా నిర్ణయించలేదని ప్రకటించారు. భారత వైమానిక దళం విషయంలో డ్రోన్లు అనేవి విప్లవాత్మక మార్పును తెచ్చేవి కావని, అవి క్రమంగా జరుగుతున్న పరిణామంలో భాగం మాత్రమేనని చెప్పారు. తాము డ్రోన్లు, లోయిటరింగ్ మ్యునిషన్స్ (లక్ష్యం వద్ద వేచి ఉండి దాడి చేయగల ఆయుధాలు) సంఖ్యను వైమానిక దళంలో పెంచుతున్నామని వివరించారు. వీటికి ప్రత్యేకమైన డ్రోన్ దళం అవసరమని తాను భావించడం లేదన్నారు. ఆధునిక సైనిక కార్యకలాపాల్లో మానవ రహిత వైమానిక వ్యవస్థలు (ఖూూ), లోయిటరింగ్ మ్యునిషన్స్ వినియోగం పెరుగుతున్న తరుణంలో ఐఏఎఫ్ చీఫ్ ఈ వ్యాఖ్యలు చేశారు.

"భారత వైమానిక దళానికి డ్రోన్లు విప్లవాత్మకం కాదు. అవి కేవలం పరిణామక్రమంలో వస్తున్న మార్పులు. ప్రత్యేక డ్రోన్ దళాన్ని ఏర్పాటు చేయం. డ్రోన్లు, లోటరింగ్ మ్యూనిషన్స్ విడివిడిగా కాకుండా ఇతర ఆయుధాలు, ప్లాట్‌ఫారమ్‌లతో కలిసి సమన్వయంగా పనిచేసినప్పుడే ఎక్కువ ప్రభావం చూపుతాయి. వైమానిక దళంలో డ్రోన్లు, లోయిటరింగ్ మ్యూనిషన్స్ సంఖ్యను పెంచుతున్నాం. వాయుసేనకు ప్రత్యేక డ్రోన్ దళం అవసరం లేదు. అవి ఒకే వ్యవస్థలో భాగంగా ఉండాలి. వాయుసేనలో డ్రోన్ సామర్థ్యాలు గత కొన్నేళ్లుగా ఉన్నాయి. ప్రస్తుతం వాటి సంఖ్యను, రకాలను, సామర్థ్యాలను మాత్రమే విస్తరిస్తున్నాం. ప్రత్యేక డ్రోన్ దళం కంటే ప్రస్తుత వాయుసేన వ్యవస్థలోనే డ్రోన్లు భాగం కావాలని, అప్పుడే సమష్టిగా ఆపరేషన్లు నిర్వహించడం సాధ్యమవుతుంది" అని తెలిపారు.

నీట్ యూజీ రీ-టెస్ట్ గురించి ఏమన్నారంటే?

నీట్ యూజీ రీ-టెస్ట్‌కు సంబంధించిన ప్రశ్నపత్రాలను చేరవేసే బాధ్యతను ఐఏఎఫ్ చేపట్టడంపైనా ఏపీ సింగ్ స్పందించారు. ఏదైనా ప్రక్రియలో మనం (ఐఏఎఫ్) సాయం అవసరమైతే తప్పకుండా చేయాలని అన్నారు. ఆ పని ఏమిటన్నది ముఖ్యం కాదన్నారు. కాగా, జూన్ 21న జరిగిన నీట్ యూజీ రీ-టెస్ట్‌కు సంబంధించిన రవాణా, ఇతర నిర్వహణ బాధ్యతలను భారత వైమానిక దళం చేపట్టింది. ఈ క్రమంలో ఐఏఎఫ్ చీఫ్ ఏపీ సింగ్ ఈ వ్యాఖ్యలు చేశారు.

"భారత వైమానిక దళం వద్ద ఉన్న విమానాల సంఖ్య తగ్గుతోంది. ప్రణాళికాబద్ధమైన విమానాల చేర్పులలో జాప్యం ఐఏఎఫ్‌ను ప్రభావితం చేసింది. ప్రస్తుత, ఊహించిన అంతరాలను పూడ్చడానికి ఐఏఎఫ్ తేజస్ మార్క్-1ఏ, మల్టీ రోల్ ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్ (వీ=ఖీూ), ఫ్యూచర్ మార్క్-2 ఫైటర్ వంటి ప్లాట్‌ఫారమ్‌ల వైపునకు చూస్తోంది" అని ఏపీ సింగ్ పేర్కొన్నారు.

దేశవ్యాప్త నిరసనలను ఒకే వేదికపైకి తెచ్చేందుకు రాహుల్ శ్రీకారం

దేశవ్యాప్తంగా జరుగుతున్న నిరసనలను ఒకే వేదికపైకి తెచ్చి, వాటికి మద్దతు కూడగట్టే లక్ష్యంతో రూపొందించిన 'సత్యాగ్రహ' అనే డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ను కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ శనివారం ప్రారంభించారు. దేశంలో వివిధ రకాల అన్యాయాలపై పోరాడుతున్న పౌరులు తమ పోరాట గాథలను, నిరసనల వివరాలను ఈ వేదిక ద్వారా పంచుకోవాలని కోరారు. అలాగే జాతిపిత మహాత్మా గాంధీ సిద్ధాంతాన్ని ప్రస్తావించారు. సత్యాగ్రహం అనేది ఒక శక్తివంతమైన ఆయుధమని అభివర్ణించారు. అయితే సత్యం వైపు ఐక్యంగా నిలబడటం అంతకంటే గొప్ప ఆయుధమని అభిప్రాయపడ్డారు. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో రాహుల్ పోస్ట్ పెట్టారు. దేశవ్యాప్తంగా ప్రజలు తమ హక్కుల కోసం పోరాడుతున్నారని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. "తరచుగా ప్రజలు తమకు జరిగిన అన్యాయం, హక్కులపై ఒంటరిగానే పోరాడుతున్నారు. జెన్‌జీ (యువత), విద్యార్థులు, రైతులు, గిరిజనులు, దళితులు, మహిళల ప్రతి పోరాటానికి ఒక ప్రత్యేకమైన కథ ఉంది. అయితే ఒంటరిగా వినిపించే గొంతుక తరచుగా అణచివేతకు గురవుతుంది. ఈ గొంతుకలన్నింటినీ ఒక మ్యాప్‌పై ఏకం చేసే ప్రయత్నమే 'సత్యాగ్రహ' డిజిటల్ ప్లాట్‌ఫామ్. సత్యమే అంతిమ ఆయుధమని బాపు (మహాత్మా గాంధీ) మనకు బోధించారు. కానీ సత్యం కోసం ఐక్యంగా నిలబడటమే అంతకంటే గొప్ప ఆయుధం" అని రాహుల్ పేర్కొన్నారు.

'రెండు నిమిషాలు కేటాయించండి చాలు'

"మీరు (దేశ ప్రజలనుద్దేశించి) కూడా ఏదైనా అన్యాయంపై పోరాడుతుంటే మీ పోరాట గాథను పంచుకోండి. అందుకు కేవలం రెండు నిమిషాల సమయమే పడుతుంది. నిరసనకారులు తమ పోరాటానికి గల కారణాలు ఈ



ప్లాట్‌ఫామ్‌లో సమర్పించవచ్చు. ఇంటరాక్టివ్ మ్యాప్ ద్వారా దేశవ్యాప్తంగా జరుగుతున్న ఇలాంటి ఉద్యమాలను గుర్తించవచ్చు. ప్రజల ప్రత్యక్ష మద్దతును పొందొచ్చు. మీ పోరాట గాథ మ్యాప్‌లో కనిపిస్తుంది. మీలాగే ఇంకా ఎవరు అన్యాయంపై పోరాడుతున్నారో మీరు చూడొచ్చు. అన్యాయాలపై, ప్రజా హక్కులపై ప్రతిపక్ష నాయకుడిగా పార్లమెంట్‌లో, దేశ వీధుల్లో, లేఖలు రాయడం ద్వారా పోరాటం చేస్తాను. ప్రజలకు అండగా నిలిచేందుకు కృషి చేస్తాను. అది నా బాధ్యత."

నిరసనల సమాచారమంతా ఒకే చోట : రాహుల్ గాంధీ

దేశవ్యాప్తంగా ద్రవ్యోల్బణం, రైతుల సమస్యలు, మహిళల భద్రత వంటి వివిధ అంశాలపై జరుగుతున్న నిరసనల నేపథ్యంలో సామాన్య ప్రజల కోసం సత్యాగ్రహ వెబ్‌సైట్‌ను రూపొందించినట్లు రాహుల్ గాంధీ తెలిపారు. దేశంలోని ప్రతి మూలన నిరసనలు జరుగుతున్నాయని ఆరోపించారు. కొందరు విద్యార్థుల గురించి, మరికొందరు మహిళల గురించి, ఇంకొందరు ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా నిరసనలు తెలుపుతున్నారని అన్నారు. ఇలా దేశవ్యాప్తంగా లక్షలాది రకాల నిరసనలు జరుగుతున్నాయని మండిపడ్డారు. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడిగా ఈ నిరసనలన్నింటికి సంబంధించిన సమాచారాన్ని ఒకే చోట క్రోడీకరించాలని తాను భావించానని చెప్పారు. అందుకే నిరసనలు తెలుపుతున్న ప్రజల కోసం సత్యాగ్రహ వెబ్‌సైట్‌ను ప్రారంభించానని చెప్పారు. ప్రజల నిరసన ఏదైనా అది దేని గురించో సంబంధించిన వివరాలను ఈ వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని పిలుపునిచ్చారు.

కేంద్రంపై రాహుల్ ఫైర్

శుక్రవారం నాడు ఎస్ఐఆర్ ప్రక్రియ, సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు రాహుల్ గాంధీ. జ్ఞానేశ్ కుమార్ త్వరగానే వెళ్లిపోతారని, ఆయనను ఆ పదవిలో కూర్చోబెట్టిన వ్యవస్థ కూడా వెళ్లిపోతుందని వ్యాఖ్యానించారు. వేలాది మంది యువత ఓట్ చోరీకి వ్యతిరేకంగా శాంతియుతంగా నిరసన వ్యక్తం చేసేందుకే రోడ్లపైకి వచ్చారని తెలిపారు. వారు తమ రాజ్యాంగ హక్కులను వినియోగించుకుంటున్నారని పేర్కొన్నారు. కానీ నరేంద్ర మోదీ- అమిత్ షా ప్రభుత్వం ఏం చేస్తుంది? అబ్బాయిలు, అమ్మాయిల్ని వీధుల నుంచి ఈడ్చుకెళ్తోందని మండిపడ్డారు. ఓట్ చోరీపై ప్రశ్నించడమే యువత చేసిన నేరమా? అని ప్రశ్నించారు.

అంతా బాగుందనుకుంటే ప్రమాదమే



ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అన్నారు. ప్రపంచ దేశాల మధ్య విభేదాలు, వాణిజ్య ఆంక్షలు, సరఫరా సమస్యలు, సాంకేతిక మార్పులు, వాతావరణ మార్పులు ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయని చెప్పారు. ఈ పరిస్థితుల్లో ఆర్థిక ముప్పుల విషయంలో ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కోవిడ్ తర్వాత ప్రపంచం ఎన్నో ఆర్థిక, ఇతర సంక్షోభాలను ఎదుర్కొందని మల్హోత్రా తెలిపారు. అయినా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వాటిని తట్టుకుని నిలబడిందన్నారు. భారత్‌లోనూ చాలాకాలంగా ఆర్థిక పరిస్థితులు స్థిరంగా ఉన్నాయని చెప్పారు. అయితే ఇదే స్థిరత్వం మరో సమస్యకు దారి తీయొచ్చని ఆయన హెచ్చరించారు. చాలాకాలం ఎలాంటి పెద్ద సంక్షోభం రాకపోతే గతంలో ఎదురైన సమస్యలను ప్రజలు, సంస్థలు మర్చిపోతారని అన్నారు. దీంతో ఎక్కువ రిస్క్ తీసుకోవడం, భారీగా అప్పులు చేయడం పెరిగే అవకాశం ఉందని చెప్పారు.

ఒక్కసారిగా సమస్యలు రావొచ్చు

బ్యాంకింగ్, ఆర్థిక రంగాల్లో సమస్యలు ఒక్కసారిగా బయటపడే అవకాశం ఉందని మల్హోత్రా తెలిపారు. అయితే వాటిని పూర్తిగా పరిష్కరించడానికి మాత్రం చాలా సమయం పడుతుందని చెప్పారు. అందుకే పరిస్థితులు బాగున్న సమయంలోనే జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థను గతంలో నడిపించిన విధానాల్లో ఇప్పుడు మార్పులు వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. దేశాల మధ్య రాజకీయ, ఆర్థిక విభేదాలు పెరుగుతున్నాయని చెప్పారు. వాణిజ్య ఆంక్షలు, సరఫరా అంతరాయాలు కూడా తరచూ ఎదురవుతున్నాయని తెలిపారు. ఈ మార్పులన్నీ ఒకదానితో ఒకటి కలిసి ప్రభావం చూపుతున్నాయని మల్హోత్రా అన్నారు. అందువల్ల కేంద్ర బ్యాంకులు కేవలం ద్రవ్యోల్బణం, ఆర్థిక స్థిరత్వంపైనే దృష్టి పెట్టకుండా ప్రపంచ పరిణామాలను కూడా గమనించాలని సూచించారు.

అమిత్ షా తెలంగాణ పర్యటన రద్దు

కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలంగాణ పర్యటన రద్దయింది. ఒక రోజు పర్యటన నిమిత్తం రేపు ఆయన రాష్ట్రానికి రావాల్సి ఉండగా.. చివరి నిమిషంలో కార్యక్రమాన్ని రద్దు చేసుకున్నారు. దానికి గల కారణాలేంటో అధికారికంగా వెల్లడికాలేదు. షెడ్యూల్ ప్రకారం అమిత్ షా నేటి రాత్రి 9 గంటలకు ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయానికి చేరుకుని, లోక్‌భవన్‌లో బస చేయాల్సి ఉంది. ఆదివారం ఉదయం మెదక్, కరీంనగర్ జిల్లాల్లో ఆయన పర్యటిస్తారని.. పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయడంతో పాటు ఇతర కార్యక్రమాల్లో పాల్గొంటారని షెడ్యూల్ లో పేర్కొన్నారు. హోంమంత్రి పర్యటన కోసం మెదక్, కరీంనగర్ జిల్లాల యంత్రాంగం ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసింది. పోలీసులు కూడా భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. అయితే పర్యటన రద్దుకు గల కారణం మాత్రం ఇంకా స్పష్టంగా తెలియలేదు. ఢిల్లీలో అత్యవసర పరిణామాలు లేదా ఇతర అనివార్య కారణాల వల్లే పర్యటన రద్దయి ఉండొచ్చని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పర్యటన రద్దుతో బీజేపీ శ్రేణుల్లో నిరాశ నెలకొంది. అమిత్ షా తెలంగాణకు ఎప్పుడు వస్తారనే విషయాన్ని త్వరలో అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.

మమతా బెనర్జీకి మరో షాక్

రెండు పార్లమెంటరీ కమిటీల ఛైర్మన్ పదవులను కోల్పోయిన టీఎంసీ



బంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీకి వరుస షాక్‌లు తగులుతున్నాయి. పార్టీలో చీలిక, అగ్రనేతలపై దాడులు, అలాగే కీలక నేతల రాజీనామాలతో సతమతమవుతున్న తృణమూల్‌కు తాజాగా మరో ఎదురుదెబ్బ తగిలింది. రెండు కీలక పార్లమెంటరీ కమిటీల ఛైర్మన్ పదవులను తృణమూల్ కాంగ్రెస్ కోల్పోయింది. రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా శనివారం నాడు వివిధ శాఖలకు సంబంధించిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీలను పునర్వ్యవస్థీకరించడంతో ఈ ఎదురుదెబ్బ మమతా పార్టీకి తగిలింది. వాణిజ్య వ్యవహారాల పార్లమెంటరీ కమిటీ ఛైర్మన్‌గా టీఎంసీకి చెందిన డోలా సేన్ స్థానంలో బీజేపీ నేత సుధాన్షు త్రివేది నియమితులయ్యారు. అలాగే రసాయనాలు, ఎరువుల కమిటీ ఛైర్మన్‌గా టీఎంసీలోని అసమ్మతి వర్గానికి చెందిన కకోలి ఘోష్ దస్తీదార్ ఎంపికయ్యారు. టీఎంసీ నేత కీర్తి ఆజాద్ స్థానంలో ఆమె బాధ్యతలు చేపట్టారు. పరిశ్రమల కమిటీకి తిరుచి శివ (డీఎంకే), ఆహారం, వినియోగదారుల వ్యవహారాలు, ప్రజా పంపిణీ కమిటీకి కె. కనిమొళి (డీఎంకే) మరోసారి ఛైర్మన్లుగా నియమితులయ్యారు. బీజేపీ మిత్రపక్షాలైన జేడీయూ, శివసేన, తెదేపాలకు చెందిన నాయకులు కూడా వివిధ పార్లమెంటరీ కమిటీల అధిపతులుగా కొనసాగుతున్నారు.

కమిటీలకు ఛైర్మన్లుగా కాంగ్రెస్ సీనియర్ నేతలు

కాంగ్రెస్ సీనియర్ నేత శశి థరూర్ విదేశీ వ్యవహారాల కమిటీ ఛైర్మన్‌గా, మరో అగ్రనాయకుడు చరణ్‌జిత్ సింగ్ చన్నీ వ్యవసాయ కమిటీ ఛైర్మన్‌గా కొనసాగుతున్నారు. విద్య, మహిళలు, పిల్లలు, యువజన వ్యవహారాల కమిటీకి హస్తం పార్టీ నాయకుడు ముకుల్ వాస్నిక్, అలాగే ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ కమిటీకి సమాజ్‌వాదీ పార్టీ నేత రామ్ గోపాల్ వర్మ ఛైర్మన్లుగా ఉన్నారు. రక్షణ శాఖ కమిటీకి బీజేపీకి చెందిన రాధా మోహన్ సింగ్ నేతృత్వం వహిస్తున్నారు. రవాణా, టూరిజం, సాంస్కృతిక కమిటీ ఛైర్మన్‌గా జేడీయూకి చెందిన సంజయ్ కుమార్ ఝా తిరిగి నియమితులయ్యారు. ఇంధన శాఖ కమిటీ అధిపతిగా శివసేనకు చెందిన శ్రీరంగ బర్నే కొనసాగుతున్నారు. ప్రజా ఫిర్యాదులు, న్యాయం, చట్టం కమిటీ ఛైర్మన్‌గా కమలం పార్టీ నాయకుడు సుజీత్ కుమార్ నియమితులయ్యారు. గతంలో ఈ కమిటీ ఛైర్మన్‌గా బీజేపీ ఎంపీ బ్రిజ్ లాల్ ఉండేవారు. బొగ్గు, గనులు, ఉక్కు శాఖ కమిటీ అధిపతిగా మాజీ కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ తిరిగి నియమితులయ్యారు. జలవనరుల కమిటీ ఛైర్మన్‌గా బీజేపీకి చెందిన రాజీవ్ ప్రతాప్ రూడీ కొనసాగుతున్నారు. కమలం పార్టీ నేత భర్తృహరి మహతాబ్ ఆర్థిక వ్యవహారాల కమిటీకి అధిపతిగా కొనసాగుతుండగా, అదే పార్టీకి చెందిన రాధా మోహన్ దాస్ అగర్వాల్‌ను హోం వ్యవహారాల కమిటీ ఛైర్మన్‌గా కొనసాగుతున్నారు. బీజేపీ సీనియర్ నేత నిశికాంత్ దూబేకు సమాచార ప్రసార, సాంకేతికత కమిటీ అధిపతిగా మరోసారి అవకాశం దక్కింది. మేధా విశ్రామ్ కులకర్ణిని సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణం, అటవీ, వాతావరణ మార్పుల కమిటీ ఛైర్‌పర్సన్‌గా మరోసారి అవకాశం కల్పించారు. రైల్వే కమిటీ ఛైర్‌పర్సన్‌గా సీఎం రమేశ్ స్థానంలో బీజేపీకి చెందిన సుధీర్ గుప్తా బాధ్యతలు చేపట్టారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ కమిటీ అధిపతిగా కాంగ్రెస్‌కు చెందిన సప్తగిరి శంకర్ ఉలక తిరిగి నియమితులయ్యారు. ఈ ఏడాదికి గానూ పార్లమెంటరీ స్థాయీ కమిటీలను రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా పునర్‌వ్యవస్థీకరించారు. ప్రతి కమిటీలోనూ లోక్‌సభ నుంచి 21 మంది, రాజ్యసభ నుంచి 10 మంది సభ్యులు ఉంటారు. పలు కమిటీలలో ఇంకా కొన్ని ఖాళీలు ఉన్నాయి. రక్షణ కమిటీలో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో విపక్ష నాయకుడు రాహుల్ గాంధీ సభ్యుడిగా ఉన్నారు. హోం వ్యవహారాల కమిటీలో ప్రియాంక గాంధీ వాద్రా సభ్యురాలిగా ఉన్నారు.

సుప్రీంకోర్టుకెక్కిన టీఎంసీ పేరు, గుర్తు వివాదం

మరోవైపు, బంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్‌లోని రెండు వర్గాల మధ్య కొనసాగుతున్న పార్టీ పేరు, గుర్తు వివాదం ఇటీవలే సుప్రీంకోర్టుకు చేరింది. ఈ క్రమంలో దేశ అత్యున్నత న్యాయస్థానం కీలక ఆదేశాలను ఇచ్చింది. ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్ పేరు, పూలు-గడ్డి గుర్తు ఎవరికి చెందాలన్న విషయాన్ని ఎన్నికల సంఘం నిర్ణయించాల్సి ఉందని తెలిపింది. ఆ ప్రక్రియను ఆలస్యం చేయకుండా పూర్తి చేసేందుకు ఈసీకి సుప్రీంకోర్టు కాలపరిమితిని కూడా విధించింది. టీఎంసీ పేరు, గుర్తుపై ఉన్న వివాదానికి సంబంధించి ఎన్నికల సంఘం ముందు ఇరు వర్గాలు తమ వాదనలు వినిపించాలని, అవసరమైన పత్రాలను అందించాలని సూచించింది. అందుకోసం నాలుగు వారాల గడువునిచ్చింది. టీఎంసీ ఇరు వర్గాలు తమ వాదనలు పూర్తి చేసిన తర్వాత ఎన్నికల సంఘం మూడు నెలల్లోగా తుది నిర్ణయం తీసుకోవాలని పేర్కొంది.

ప్రత్యేక పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ.. విద్యకు భరోసా

ప్రశస్త యాప్ ద్వారా స్క్రీనింగ్‌ను త్వరితగతిన పూర్తి చేయాలి

ఎంఈవోలకు అవగాహన కార్యక్రమంలో డీఈవో ఎల్.చంద్రకళ



విజయవాడ, మహానగర్

ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను చిన్న వయసులోనే గుర్తించి, వారికి అవసరమైన సహాయ సహకారాలు, వసతులు కల్పిస్తూ సాధారణ పిల్లలతో సమానంగా విద్యను అభ్యసించేలా చూడాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.చంద్రకళ సూచించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల (సీడబ్ల్యూఎస్ఎన్) విద్య, గుర్తింపు, వారికి అందుతున్న ప్రభుత్వ పథకాలు, సౌకర్యాలపై జిల్లాలోని ఎంఈవో-1, ఎంఈవో-2లకు శనివారం విజయవాడలోని సీవీఆర్ మునిసిపల్ హైస్కూల్‌లో శిక్షణ, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో చంద్రకళ మాట్లాడుతూ పాఠశాలల్లో చదువుతున్న పిల్లల్లో ప్రత్యేక అవసరాలు కలిగిన వారిని ఉపాధ్యాయులు చిన్న వయస్సులోనే గుర్తించడం ఎంతో ముఖ్యమన్నారు. ఎన్‌సీఈఆర్‌టీ రూపొందించిన ప్రశస్త యాప్ ద్వారా ప్రతి ఉపాధ్యాయుడు స్క్రీనింగ్ ప్రక్రియను పూర్తి చేసేలా ఎంఈవోలు పర్యవేక్షించాలని సూచించారు. స్క్రీనింగ్ ద్వారా గుర్తించిన పిల్లలకు పాఠశాలల్లో అడ్మిషన్లు కల్పించడంతో పాటు, వారు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు విద్య, వైద్యం, పునరావాసం తదితర సేవలు సమర్థవంతంగా అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ రమేష్ బాబు మాట్లాడుతూ ప్రతి భవిత సెంటర్‌లో సుమారు 20 మంది ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు అవసరమైన సేవలు అందుతున్నాయని తెలిపారు. భవిత సెంటర్ల ద్వారా పిల్లలకు ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ వంటి సేవలను అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి ఐదు మున్సిపాలిటీలకు ఒక ఆటిజం సెంటర్ ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. జిల్లాలో 2,351 మందికి పైగా సీడబ్ల్యూఎస్ఎన్ చిన్నారులు ఉన్నారని వెల్లడించారు.
జిల్లా సహిత విద్యా సమన్వయకర్త నారాయణ మాట్లాడుతూ ఆర్‌పీడబ్ల్యూడీ చట్టం, 2016 ప్రకారం 21 రకాల వైకల్యాలను ప్రభుత్వం గుర్తించిందని తెలిపారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ప్రభుత్వం వివిధ రకాల ప్రయోజనాలను అందిస్తోందని చెప్పారు. ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్, హోమ్ బేస్డ్ ఎడ్యుకేషన్ అలవెన్స్, ఎస్కార్ట్ అలవెన్స్ కింద ఒక్కొక్కరికి రూ. 6,000 చొప్పున, బాలికలకు రూ. 2,000 స్టైపెండ్ అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గర్ల్స్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్, విద్యాశాఖ అధికారులు, సహిత విద్యా సిబ్బంది, ఎంఈవోలు తదితరులు పాల్గొన్నారు.

తుది దశకు 51వ సబ్-జూనియర్ నేషనల్ బాస్కెట్‌బాల్ ఛాంపియన్‌షిప్





మహిళల ఫైనల్లో మహారాష్ట్ర--తమిళనాడు

పురుషుల టైటిల్ పోరులో ఉత్తరప్రదేశ్.. మరో బెర్త్ కోసం రాజస్థాన్-హర్యానా

విజయవాడ స్పోర్ట్స్

నగరంలోని మారిస్ స్టెల్లా కళాశాల ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న 51వ సబ్--జూనియర్ నేషనల్ బాస్కెట్‌బాల్ ఛాంపియన్‌షిప్ (బాలబాలికలు)లో ఫైనల్ బెర్త్‌లు ఖరారయ్యాయి. బాలికల విభాగంలో మహారాష్ట్ర, తమిళనాడు జట్లు టైటిల్ పోరుకు అర్హత సాధించగా, బాలుర విభాగంలో ఉత్తరప్రదేశ్ ఫైనల్‌కు చేరుకుంది. మరో ఫైనలిస్ట్ కోసం రాజస్థాన్, హర్యానా జట్ల మధ్య సెమీఫైనల్ మ్యాచ్ జరగాల్సి ఉంది. బాలికల తొలి సెమీఫైనల్‌లో మహారాష్ట్ర 71--60తో కర్ణాటకపై విజయం సాధించి ఫైనల్‌లోకి ప్రవేశించింది. హాఫ్‌టైమ్‌కు మహారాష్ట్ర 36--25తో ఆధిక్యంలో నిలిచింది. మహారాష్ట్ర తరపున నేత్రా డామ్కే 17, అనికా నాయక్ 10 పాయింట్లు సాధించగా, కర్ణాటక తరపున ఆరోషి అనంత్ 22, ఖుషి ఖుషి 10 పాయింట్లు చేశారు. మరో సెమీఫైనల్‌లో తమిళనాడు 73--41తో ఉత్తరప్రదేశ్‌ను ఓడించి ఫైనల్ బెర్త్ ఖరారు చేసుకుంది. తమిళనాడు తరపున లియో జాఫ్లిన్ 17, వి. అన్నిక 11, ధన్యా ఎం. 10 పాయింట్లు సాధించగా, ఉత్తరప్రదేశ్ తరపున తేజస్వి ఖానా 10 పాయింట్లు నమోదు చేసింది. బాలుర విభాగంలో జరిగిన సెమీఫైనల్‌లో ఉత్తరప్రదేశ్ 63--55తో మహారాష్ట్రను ఓడించి ఫైనల్‌లోకి దూసుకెళ్లింది. హాఫ్‌టైమ్ సమయానికి ఉత్తరప్రదేశ్ 31--26తో ఆధిక్యంలో ఉంది. ఉత్తరప్రదేశ్ తరపున సాహిల్ కుమార్ 15, వనిష్ తోమర్ 12 పాయింట్లు సాధించగా, మహారాష్ట్ర తరపున మయాంక్ శర్మ 16 పాయింట్లు నమోదు చేశాడు. మరో బాలుర సెమీఫైనల్‌లో రాజస్థాన్, హర్యానా తలపడనుండగా, ఆ మ్యాచ్‌లో విజేత ఉత్తరప్రదేశ్‌తో టైటిల్ కోసం పోటీపడనుంది. ఇదిలా ఉండగా, క్వార్టర్‌ఫైనల్స్‌లో బాలుర విభాగంలో మహారాష్ట్ర 78--72తో మధ్యప్రదేశ్‌ను, రాజస్థాన్ 69--53తో ఛత్తీస్‌గఢ్‌ను ఓడించాయి. బాలికల విభాగంలో ఉత్తరప్రదేశ్ 68--57తో మధ్యప్రదేశ్‌పై, మహారాష్ట్ర 84--43తో ఢిల్లీపై విజయాలు సాధించాయి. ఇతర వర్గీకరణ మ్యాచ్‌ల్లో తెలంగాణ బాలుర జట్టు తమిళనాడుపై 66--65తో, మధ్యప్రదేశ్ బాలుర జట్టు కర్ణాటకపై 78--49తో, ఛత్తీస్‌గఢ్ బాలుర జట్టు ఢిల్లీపై 64--49తో విజయం సాధించాయి. బాలికల విభాగంలో హర్యానా ఆంధ్రప్రదేశ్‌పై 54--50తో, మధ్యప్రదేశ్ పశ్చిమ బెంగాల్‌పై 43--19తో, కేరళ ఢిల్లీపై 61--44తో, ఒడిశా పంజాబ్‌పై 69--31తో విజయం సాధించాయి.సుకునే అవకాశం కూడా ఉంటుంది. కార్యక్రమంలో పాల్గొనే వారికి బీజీఎంఐ పోస్టర్లు, స్టిక్కర్ ప్యాక్‌లు, బొటనవేలి పట్టీలు, గుర్తింపు చిహ్నాలు వంటి బహుమతులు అందించనున్నారు. ఆటలోని గణాంకాల ఆధారంగా వ్యక్తిగతీకరించిన గుర్తింపు పట్టీని కూడా రూపొందిస్తారు. కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన వారికి పరిమిత సంఖ్యలో ప్రత్యేక బీజీఎంఐ వస్తువులు అందిస్తారు. ప్రవేశం ఉచితం. గౌహతి, వడోదర, ఇండోర్ తర్వాత హాట్ డ్రాప్ పర్యటనలో విశాఖ నాలుగో నగరంగా నిలిచింది.

ఫ్లాష్‌మాబ్‌లతో విజయవాడ ఉత్సవ్ ప్రచారం

ప్రధాన కూడళ్లలో కళాకారుల నృత్య ప్రదర్శనలు

ఉత్సాహంగా తిలకించిన నగరవాసులు





విజయవాడ, మహానగర్

విజయవాడ ఉత్సవ్‌కు విస్తృత ప్రచారం కల్పించేందుకు నగరంలోని ప్రధాన కూడళ్లలో శనివారం నిర్వహించిన ఫ్లాష్‌మాబ్ కార్యక్రమాలు ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి. సొసైటీ ఫర్ వైబ్రెంట్ విజయవాడ ఆధ్వర్యంలో, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, పర్యాటక శాఖ సహకారంతో నిర్వహిస్తున్న విజయవాడ ఉత్సవ్ ప్రచారంలో భాగంగా పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని చిట్టినగర్ సెంటర్, భవానిపురం శివాలయం సెంటర్, కాళేశ్వరరావు మార్కెట్ సెంటర్, కలరా హాస్పిటల్ సెంటర్లలో ప్రత్యేక ఫ్లాష్‌మాబ్ కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ప్రధాన కూడళ్లలో ఒక్కసారిగా సంగీతం ప్రారంభం కావడంతో యువ కళాకారులు ఉత్సాహభరితమైన నృత్య ప్రదర్శనలతో సందడి చేశారు. సమన్వయంతో కూడిన నృత్య కదలికలు, ఆకట్టుకునే కొరియోగ్రఫీతో కళాకారులు చేసిన ప్రదర్శనలను నగరవాసులు, ప్రయాణికులు ఆసక్తిగా తిలకించారు. పలువురు తమ మొబైల్ ఫోన్లలో ప్రదర్శనలను చిత్రీకరించారు. విజయవాడ నగర కళా, సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబించే అంశాలతో పాటు విజయవాడ ఉత్సవ్ స్ఫూర్తిని చాటిచెప్పే నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. యువతలో ఉత్సవంపై ఆసక్తిని పెంచడం, నగరవాసులను ఉత్సవంలో భాగస్వాములను చేయడం, కార్యక్రమ విశేషాలను వినూత్న రీతిలో ప్రజల్లోకి తీసుకెళ్లడం ఫ్లాష్‌మాబ్‌ల ప్రధాన ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు. సంప్రదాయ ప్రచార విధానాలకు భిన్నంగా సంగీతం, నృత్యం, యువత ఉత్సాహంతో నిర్వహించిన ఈ కార్యక్రమాలు నగరంలో ఉత్సవ వాతావరణాన్ని మరింత పెంచాయని పేర్కొన్నారు. విజయవాడకు ఉన్న చారిత్రక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక ప్రత్యేకతలను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు విజయవాడ ఉత్సవ్‌ను నగర ప్రజలందరి ఉత్సవంగా నిర్వహించాలనే లక్ష్యంతో ఇటువంటి వినూత్న కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి నూర్ భాషా కార్పొరేషన్ చైర్మన్ నాగుల్ మీరా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఫతావుల్లా, ఆషా, ఏదుపాటి రామయ్య, గుర్రంకొండ పాల మాధవ్ తదితరులు పాల్గొన్నారు. విజయవాడ ప్రజలు, కళాకారులు, యువత, విద్యార్థులు పెద్ద సంఖ్యలో విజయవాడ ఉత్సవ్‌లో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని సొసైటీ ఫర్ వైబ్రెంట్ విజయవాడ ప్రతినిధులు కోరారు.

బిగ్‌బాస్ తెలుగు హౌస్‌లోకి ఏడోసారి హైయర్ ఇండియా

తిరుపతి

హైయర్ అప్లయెన్సెస్ ఇండియా వరుసగా ఏడో ఏడాది బిగ్‌బాస్ తెలుగు హౌస్‌లోకి తిరిగి ప్రవేశించింది. సీజన్-10లో అసోసియేట్ స్పాన్సర్‌గా తన భాగస్వామ్యాన్ని కొనసాగిస్తోంది. జియోస్టార్ ఆధ్వర్యంలో పండుగ సీజన్ సందర్భంగా ఆరు ప్రాంతీయ బిగ్‌బాస్ ఎడిషన్లను అందించే కార్యక్రమంలో భాగంగా ఈ భాగస్వామ్యం కొనసాగుతోంది. తెలుగు మాట్లాడే ప్రేక్షకులతో హైయర్‌కు ఉన్న అనుబంధాన్ని మరింత బలోపేతం చేసేందుకు బిగ్‌బాస్ తెలుగు వేదికను ఉపయోగించుకోనుంది. ఇందులో భాగంగా హైయర్ తన వినూత్న హోమ్ అప్లయెన్సెస్ పోర్ట్‌ఫోలియోను బిగ్‌బాస్ హౌస్‌లో ప్రదర్శించడంతో పాటు ప్రత్యేకంగా రూపొందించిన లైవ్ వాషింగ్ మెషీన్ టాస్క్‌ను నిర్వహించనుంది. హైయర్ ఇండియా సీఈఓ ఎన్.ఎస్. సతీష్ మాట్లాడుతూ, జాతీయ బ్రాండ్ నిర్మాణంలో ప్రాంతీయ అనుబంధానికి తమ సంస్థ ప్రాధాన్యత ఇస్తుందన్నారు. తెలుగు ప్రేక్షకులతో అనుబంధాన్ని బలోపేతం చేయడంలో బిగ్‌బాస్ తెలుగు కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు.

న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

- కేంద్ర న్యాయశాఖ మంత్రికి న్యాయవాదుల బృందం వినతి



హైదరాబాద్, మహానగర్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంతో పాటు వారి సంక్షేమానికి సంబంధించిన పలు డిమాండ్లపై కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్‌కు న్యాయవాదుల బృందం వినతిపత్రం సమర్పించింది. బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హెడ్‌క్వార్టర్స్ ఇన్‌చార్జి, బార్ కౌన్సిల్ సభ్యుడు, న్యాయవాది ఉప్పలపాటి శ్రీనివాస రాజు నేతృత్వంలోని బృందం హైదరాబాద్‌లో కేంద్ర మంత్రిని కలిసి రాష్ట్రంలోని న్యాయవాదుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లింది. న్యాయవాదుల సంక్షేమం, వృత్తిపరమైన రక్షణ, న్యాయవ్యవస్థకు సంబంధించిన మౌలిక సదుపాయాల అంశాలపై కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రతినిధులు కోరారు. దేశవ్యాప్తంగా అడ్వకేట్స్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను అమలు చేయడంతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని న్యాయవాదులందరికీ ఆరోగ్య బీమా పథకాన్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని సీనియర్ న్యాయవాదులకు జార్ఖండ్ తరహాలో పెన్షన్ పథకం అమలు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదించి న్యాయవాదులకు హౌసింగ్ సైట్ల కేటాయింపునకు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే కర్నూలులో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు బెంచ్ ఏర్పాటును వేగవంతం చేయాలని, రాయలసీమ ప్రాంతంలో డెబ్ట్ రికవరీ ట్రిబ్యునల్ (డీఆర్‌టీ) ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో జీఎస్టీ ట్రిబ్యునల్, ఐటీ అప్పీలేట్ ట్రిబ్యునల్, రైల్వే అప్పీలేట్ ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలని, అమరావతిలోని సర్క్యూట్ బెంచ్ స్థానంలో సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ (క్యాట్) ఫుల్ బెంచ్ ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్రంలో న్యాయవాదుల నియామకాలకు సంబంధించి కూడా తగిన చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రిని కోరారు. న్యాయవాదుల సంక్షేమంతో పాటు రాష్ట్రంలో న్యాయవ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు ఈ అంశాలపై కేంద్ర ప్రభుత్వం సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ హైకోర్టు న్యాయవాదులు, ఏపీ బీజేపీ మీడియా ఇన్‌చార్జి కిలారి దిలీప్, న్యాయవాదులు, అధికార ప్రతినిధి షేక్ బాజీ, పి. గోవింద్, ఏ. శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంగన్‌వాడీ సేవా సంకల్ప అభియాన్



ఆగిరిపల్లి, మహానగర్

మండల పరిధిలోని నెక్కలం గొల్లగూడెం గ్రామంలోని గొల్లగూడెం--2 అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం అంగన్‌వాడీ ఉత్సవం, సేవా సంకల్ప అభియాన్, పోషణ మాస కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల మహిళా అధ్యక్షురాలు అన్నే విజయరాణి, నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు శీలం పద్మశ్రీ, ప్రధాన కార్యదర్శి బి. అంజలి, నూజివీడు అర్బన్ తెలుగు మహిళా అధ్యక్షురాలు యార్లగడ్డ రాధాకుమారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి. రాగమయి, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, తల్లులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాగమయి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను, పౌష్టికాహార పదార్థాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పౌష్టికాహారం ప్రాముఖ్యతను వివరించారు. చిన్నారుల ఎదుగుదలలో సమస్యలను ముందుగానే గుర్తించేందుకు ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో స్క్రీనింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండల మహిళా అధ్యక్షురాలు అన్నే విజయరాణి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పోషకాహారాన్ని లబ్ధిదారులు ఇంటికి తీసుకెళ్లి స్వయంగా వినియోగించుకోవాలని సూచించారు. పోషకాహారాన్ని సక్రమంగా తీసుకోవడం ద్వారా రక్తహీనతను నివారించవచ్చని తెలిపారు. బాల్య వివాహాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు శీలం పద్మశ్రీ మాట్లాడుతూ మునగాకు ప్రాముఖ్యతను, గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు అందిస్తున్న సేవలను గుర్తించి వారిని అభినందించారు. అనంతరం లబ్ధిదారులు, నాయకులు కలిసి అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లను సన్మానించారు.

స్వచ్ఛతా మారథాన్ స్ఫూర్తితో విజయవాడ ఉత్సవ్‌ను విజయవంతం చేయాలి

విజయవాడ ఉత్సవ్‌లో 5 వేల మంది కళాకారులతో ప్రత్యేక కార్నివాల్

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, పలువురు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులకు ఆహ్వానం

స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్



విజయవాడ, మహానగర్

స్వచ్ఛతా మారథాన్‌కు ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని ఏపీ స్వచ్ఛ కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర ఉద్యమం ముందుకు సాగుతోందన్నారు. 22 రాష్ట్రాల నుంచి 10 వేల మందికి పైగా మారథాన్‌లో పాల్గొనడం అభినందనీయమని, విజయవాడ ప్రజలు పెద్ద సంఖ్యలో భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందన్నారు. స్వచ్ఛతా మారథాన్ విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. మారథాన్‌ను విజయవంతం చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా అభినందించారని చెప్పారు. ఇదే స్ఫూర్తితో విజయవాడ ఉత్సవ్--2.0ను మరింత ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పట్టాభిరామ్ వెల్లడించారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, వివిధ సంస్థలు సమిష్టిగా ఏర్పాట్లలో భాగస్వాములవుతున్నాయని తెలిపారు. విజయవాడ ఉత్సవ్‌కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో పాటు కేంద్ర మంత్రులు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులను ఆహ్వానించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు చెప్పారు. దసరా ఉత్సవాలు, విజయవాడ ఉత్సవ్‌కు లక్షలాది మంది తరలివచ్చే అవకాశం ఉన్నందున అందుకు అనుగుణంగా విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. గత ఏడాది కంటే ఈసారి మరింత వైవిధ్యంగా, ఘనంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. గత ఏడాది 3 వేల మంది కళాకారులతో నిర్వహించిన కార్నివాల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని, ఈసారి 5 వేల మంది కళాకారులతో భారీ కార్నివాల్ నిర్వహించనున్నట్లు తెలిపారు. పున్నమిఘాట్, ఎం.బి.కె. స్టేడియం, సిద్ధార్థ ఫార్మసీ కళాశాల తదితర ప్రాంతాల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో సరస్సు మేళా, డ్రోన్ షోలు, క్రాకర్ షోలు, లేజర్ షోలు వంటి ప్రత్యేక కార్యక్రమాలు కూడా ఉంటాయని తెలిపారు. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో యువత, చిన్నారులు, పెద్దలను భాగస్వాములను చేస్తూ వివిధ పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. విజయవాడ సంస్కృతి, సంప్రదాయాలు, కళలను ప్రతిబింబించేలా కార్యక్రమాలను రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. బిల్డింగ్స్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ చైర్మన్ గొట్టిముక్కల రఘు మాట్లాడుతూ గత ఏడాది విజయవాడ ఉత్సవ్ అంగరంగ వైభవంగా జరిగిందని, ఈసారి అంతకంటే ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. విజయవాడతో అనుబంధం ఉన్న ప్రతి ఒక్కరూ ఉత్సవ్‌లో భాగస్వాములు కావాలని కోరారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు వివిధ పోటీలు నిర్వహించడంతో పాటు ఉమ్మడి కుటుంబాల ప్రాధాన్యతను చాటిచెప్పేలా పెద్ద కుటుంబాలను వేదికపై సత్కరించే కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. స్వచ్ఛతా మారథాన్‌ను విజయవంతం చేసిన ప్రజల భాగస్వామ్యంతోనే విజయవాడ ఉత్సవ్--2.0ను కూడా మరింత విజయవంతం చేయాలని పట్టాభిరామ్, రఘు కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్లు పట్టాభి, గొట్టుముక్కల రఘురామరాజు, గుమ్మడి గోపాల కృష్ణ పాల్గొన్నారు.

కళా, సాంస్కృతిక, సృజనాత్మక ప్రతిభకు వేదికగా విజయవాడ ఉత్సవ్--2.0

విద్యార్థుల్లో అవగాహన కల్పించిన జిజ్ఞాస ఆర్ట్ వర్క్స్, కేశినేని ఫౌండేషన్ ప్రతినిధులు



విజయవాడ, మహానగర్

సొసైటీ ఫర్ వైబ్రెంట్ విజయవాడ ఆధ్వర్యంలో, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, పర్యాటక శాఖ సహకారంతో నిర్వహిస్తున్న విజయవాడ ఉత్సవ్--2.0లో విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. విజయవాడ ఉత్సవ్‌లో భాగంగా జిజ్ఞాస ఆర్ట్ వర్క్స్, కేశినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న వివిధ కళా, సాంస్కృతిక, సృజనాత్మక పోటీలపై విజయవాడ తూర్పు నియోజకవర్గంలోని విద్యా సంస్థల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మధు గార్డెన్స్ జమ్మిచెట్టు సెంటర్ పరిధిలోని శారదా కళాశాల, నారాయణ స్కూల్, చైతన్య స్కూల్‌లను జిజ్ఞాస ఆర్ట్ వర్క్స్, కేశినేని ఫౌండేషన్ ప్రతినిధులు సందర్శించి అధ్యాపకులు, విద్యార్థులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విజయవాడ ఉత్సవ్‌లో నిర్వహించనున్న వివిధ విభాగాల పోటీల వివరాలను వారికి తెలియజేశారు. విద్యార్థుల్లో దాగి ఉన్న కళా, సాంస్కృతిక, సృజనాత్మక ప్రతిభను వెలికితీసేందుకు ఈ పోటీలు మంచి వేదికగా నిలుస్తాయని నిర్వాహకులు వివరించారు. విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించడంతో పాటు విజయవాడ నగర సంస్కృతి, కళలు, సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఉత్సవంలో భాగస్వాములు కావాలని కోరారు. ప్రతి విద్యార్థికి తమలోని ప్రతిభను చాటుకునే అవకాశం కల్పించడమే పోటీల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. విజయవాడ ఉత్సవ్‌ను కేవలం సాంస్కృతిక కార్యక్రమంగా కాకుండా విద్యార్థులు, యువత, కళాకారులు, నగరవాసులు కలిసి జరుపుకునే నగర ఉత్సవంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యా సంస్థల యాజమాన్యాలు, అధ్యాపకులు విద్యార్థులను ప్రోత్సహించి పోటీల్లో పెద్ద సంఖ్యలో పాల్గొనేలా చేయాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, సౌజన్య, అరుణ తదితరులు పాల్గొన్నారు.

పవన్ కళ్యాణ్ ప్రత్యేక శ్రద్ధతో పల్లెలకు వెలుగులు

అవనిగడ్డ, మహానగర్

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక శ్రద్ధతో పల్లెలకు వెలుగులు లభిస్తున్నాయని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. అవనిగడ్డ పంచాయతీ పరిధిలోని కొత్తపేట నుంచి కోడూరు-అవనిగడ్డ ప్రధాన రహదారి వరకూ నాబార్డ్ నిధులు రూ.55 లక్షలతో నిర్మించిన 484 మీటర్ల పొడవు 3.75 మీటర్ల వెడల్పుతో నిర్మించిన నూతన తారు రోడ్డును ఎమ్మెల్యే శనివారం ప్రారంభించారు. అనంతరం రామచంద్రాపురం పంప్ హౌస్ వద్ద ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన-3 నిధులు రూ.4కోట్ల 82 లక్షల 32 వేలతో నూతనంగా నిర్మించిన మోదుమూడి - లింగారెడ్డిపాలెం వయా సర్దాకోడు, రామచంద్రాపురం, దక్షిణ చిరువోలులంక రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా సభల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అభివృద్ధి అడుగంటి రహదారులు అధ్వాన్నంగా మారాయన్నారు. పంచాయతీరాజ్, ఆర్.అండ్.బీ రహదారులు కనీస మరమ్మత్తులకు నోచుకోక దారుణంగా విధ్వంసానికి గురయ్యాయన్నారు. కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పంచాయతీరాజ్ - గ్రామీణ అభివృద్ధి శాఖ తీసుకోవడంతో పల్లెల వికాసానికి బాటలు పడ్డాయన్నారు. మహాత్మా గాంధీ ఆకాంక్షించిన గ్రామ స్వరాజ్యం సాకారానికి పవన్ కళ్యాణ్ చేపట్టిన పల్లె పండుగ కార్యక్రమం ద్వారా అవనిగడ్డ నియోజకవర్గంలో ఇప్పటికే రూ.70 కోట్లతో రహదారుల నిర్మాణం చేశామన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన నిధులు, నాబార్డ్ నిధులతో నూతన తారు రహదారులు నిర్మించి అవనిగడ్డ మండలంలోని ఏడు గ్రామాల ప్రజలకు నాణ్యమైన రహదారి సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. పవన్ కళ్యాణ్ ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో మాట్లాడి మంజూరు చేయించిన సాస్కి నిధులతో నియోజకవర్గంలో అనేక తారు రోడ్లు నిర్మించామన్నారు. పల్లె పండుగ-3.0 కార్యక్రమం ద్వారా నియోజకవర్గంలో రూ.13కోట్ల 37లక్షలతో 24.49 కిలోమీటర్ల తారు రోడ్లు, 5.52 కిలోమీటర్ల సీసీ రోడ్లు, 1.77 కిలోమీటర్ల గ్రావెల్ రోడ్లు నిర్మిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమం పురస్కరించుకొని నియోజకవర్గంలో 213 గోకులం షెడ్ల నిర్మాణానికి రూ.3.83 కోట్లు, 4.97 కిలోమీటర్ల మ్యాజిక్ డ్రైనేజీ నిర్మాణానికి రూ.44.35 లక్షలు, 76 మంది రైతులకు చెందిన 80 ఎకరాల్లో ఉద్యానవన పంటల ప్రోత్సాహానికి రూ.75.17 లక్షలు, 30 ఫామ్ పాండ్స్ నిర్మించిన రూ.39.37 లక్షలు మంజూరు అయినట్లు వివరించారు. వీటితోపాటు రైతులకు కీలకమైన డొంకరోడ్లను కూడా పవన్ కళ్యాణ్ సహకారంతో నిర్మిస్తామన్నారు. పేద ప్రజలకు విస్తృత సంక్షేమ కార్యక్రమాలతో పాటు, గ్రామాల అభివృద్ధికి మౌలిక సౌకర్యాల కల్పనకు కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాముఖ్యత ఇస్తుందన్నారు. ఎల్-నీనో నేపథ్యంలో వర్షాల కొరత కారణంగా నెలకొన్న పరిస్థితి నేపథ్యంలో నియోజకవర్గంలోని రైతులకు అండగా ఉంటామని ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ స్పష్టం చేశారు. గత వైసిపి పాలకులు రైతులకు కనీస ధైర్యం చెప్పకపోవడంతో నియోజకవర్గంలో మునుపెన్నడు చూడని విధంగా రైతు ఆత్మహత్యలు సంభవించాయన్నారు. ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలకు పవన్ కళ్యాణ్, నారా లోకేష్ వ్యక్తిగతంగా ఆర్థిక సహాయం అందించినప్పటికీ అప్పటి ప్రభుత్వం కనీసం స్పందించకుండా రైతుల మనో ధైర్యాన్ని కుంగతీసిందన్నారు. కృష్ణాడెల్టాకు కృష్ణానది నుంచి చుక్కనీరు రానప్పటికీ, చంద్రబాబు రాష్ట్ర విభజన జరిగిన వెంటనే ముందు చూపుతో నిర్మించిన పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా డెల్టాకు లభించిన గోదావరి నీటితో వరి సాగు సాధ్యమైందన్నారు. పంటను కాపాడుకునేందుకు, రైతులకు ఎలాంటి కష్టం వచ్చినా ఆదుకునేందుకు వెన్నంటే ఉంటామని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం.వనజ, పంచాయతీరాజ్ ప్రాజెక్టు డీఈఈ బీ.రవీంద్ర, జనసేన పార్టీ మండల అధ్యక్షులు గుడివాక శేషుబాబు, సొసైటీ చైర్మన్ యలవర్తి చిన్నా తదితరులు పాల్గొన్నారు.



సీసీఎస్ ఏసీపీగా వి.ఎస్.ఎన్. వర్మ బాధ్యతల స్వీకరణ



విజయవాడ క్రైమ్, మహానగర్

పోలీస్ కమిషనరేట్‌లో సీసీఎస్ నూతన ఏసీపీగా వి.ఎస్.ఎన్. వర్మ బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీల్లో భాగంగా మంగళగిరి హెడ్‌క్వార్టర్స్‌లో ఏసీపీగా విధులు నిర్వహిస్తున్న వి.ఎస్.ఎన్. వర్మను జిల్లా పోలీస్ కమిషనరేట్‌లో సీసీఎస్ ఏసీపీగా బదిలీ చేశారు. ఈ నేపథ్యంలో ఆయన శనివారం తన కార్యాలయంలో ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం విజయవాడ నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్‌కు మొక్కను అందజేశారు. అనంతరం ఇరువురు అధికారులు పరస్పరం అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

సైబర్ నేరాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలి

క్లిక్ చేసే ముందు ఒక్కసారి ఆలోచించాలి

అపరిచిత లింకులు, వ్యక్తిగత సమాచారంతో జాగ్రత్త

సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలి

నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర బాబు



విజయవాడ క్రైమ్, మహానగర్

డిజిటల్ సాంకేతికత వేగంగా విస్తరిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో యువత, విద్యార్థులు సైబర్ నేరాల పట్ల నిరంతరం అప్రమత్తంగా ఉండాలని నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర బాబు సూచించారు. కానూరులోని వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో అసోసియేషన్ ఆఫ్ రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్స్, రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు 'సైబర్ క్రైమ్ ప్రివెన్షన్--ఎంపవరింగ్ యూత్ టు ప్రివెంట్ సైబర్ క్రైమ్స్' అంశంపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ఏదైనా లింక్‌పై క్లిక్ చేసే ముందు ఒకసారి ఆలోచించాలని, అపరిచిత లింకులు, వ్యక్తిగత సమాచారం విషయంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. సైబర్ నేరాలపై 'జీరో టాలరెన్స్' విధానాన్ని పాటిస్తున్నామని, నేరం జరిగిన తర్వాత ఫిర్యాదు చేయడం కంటే ప్రజలు సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకునేలా అవగాహన కల్పించడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఇందులో భాగంగా ఎన్.టి.ఆర్. జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రజలను చైతన్యపరిచేందుకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సైబర్ నేరగాళ్లు రోజురోజుకూ కొత్త తరహా మోసాలతో ప్రజలను, ముఖ్యంగా యువతను లక్ష్యంగా చేసుకుంటున్నారని, అందువల్ల డిజిటల్ వేదికలను బాధ్యతాయుతంగా వినియోగించాలని సూచించారు. సైబర్ మోసాలకు గురైన వారు ఆలస్యం చేయకుండా వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. యువతను సైబర్ డిజిటల్ సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో అవగాహన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సైబర్ క్రైమ్స్ ఏసీపీ భాను ప్రకాష్ రెడ్డి, లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 316డి గవర్నర్ ఎన్.వి.వి.ఎస్.వి. ప్రసాద్, సిద్ధార్థ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డా. బి. పాండురంగారావు, ఏఆర్‌పీఓ అధ్యక్షులు ఏ.ఎస్.ఎన్. రెడ్డి, డీఎస్పీ (రిటైర్డ్), కార్యదర్శి డా. టి. హరికృష్ణ, ఎస్పీ (రిటైర్డ్), ఇతర రిటైర్డ్ పోలీస్ అధికారులు, కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో ఆగిరిపల్లి విద్యార్థుల సత్తా



ఆగిరిపల్లి, మహానగర్

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్--2026 ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి అండర్--14 హ్యాండ్‌బాల్ పోటీల్లో స్థానిక హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. శనివారం విజయవాడలోని కేబీసీ జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో హైస్కూల్‌కు చెందిన 23 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో కే. లికేష్, ఎన్. నందిని, ఎస్‌కే. జోయా అన్వర్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. విద్యార్థులు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనేలా ప్రోత్సహించి, శిక్షణ అందించిన పీడీ శివ నాగేంద్రరావు, సుగుణరావు, సాయి కిషోర్‌లను గ్రామస్తులు, విద్యా కమిటీ సభ్యులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ విద్యార్థులు మెరుగైన ప్రతిభ కనబరిచి విజయాలు సాధించి మండలానికి మరింత గుర్తింపు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.

శ్రీవిష్ణు 'కామ్రేడ్ కళ్యాణ్' టైటిల్ సాంగ్ విన్నారా..?



శ్రీ విష్ణు హీరోగా వస్తోన్న లేటెస్ట్ మూవీ కామ్రేడ్ కల్యాణ్. ఈ సినిమాకు జానకీరామ్ మారెళ్ల దర్శకత్వం వహిస్తున్నారు. ఈమూవీ అక్టోబరు 9న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ మూవీలో మహిమా నంబియార్ హీరోయిన్‌గా కనిపించనుంది. ఈ చిత్రాన్ని స్కంద వాహన మోషన్ పిక్చర్స్ ఎల్ఎల్పీ అండ్ కోన ఫిల్మ్ కార్పొరేషన్ బ్యానర్లపై వెంకట కృష్ణ కర్నాటి, సీతా కర్నాటి నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ మూవీ నుంచి పలు పాటలను విడుదల చేశారు. తాజాగా టైటిల్ సాంగ్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. విజయ్ బుల్గానిన్ స్వరాలు సమకూర్చిన ఈ పాటకు భాస్కరభట్ల సాహిత్యం అందించారు. రాహుల్ సిప్లిగంజ్ ఆలపించారు. కాగా ఈ చిత్రంలో రాధిక శరత్‌కుమార్, షైన్ టామ్ చాకో, ఉపేంద్ర లిమాయే కీలక పాత్రలు పోషిస్తున్నారు.

రెండు వారాల గ్యాప్‌లో సాయిపల్లవి రెండు పాన్ ఇండియా సినిమాలు.. హీరోయిన్‌కు ప్లస్సా? నిర్మాతలకు రిస్కా?

ఒక సినిమా కోసం ప్రేక్షకులు ఎదురుచూస్తున్న సమయంలోనే అదే హీరో లేదా హీరోయిన్ నటించిన మరో సినిమా థియేటర్లలోకి వస్తే పరిస్థితి ఎలా ఉంటుంది? సాధారణంగా ఒకే నటుడి సినిమాలు తక్కువ గ్యాప్‌లో విడుదలైతే బాక్సాఫీస్ పరంగా పోటీ నెలకొనే అవకాశం ఉంటుంది. అయితే స్టార్ హీరోయిన్ సాయిపల్లవి విషయంలో ఇప్పుడు ఇదే పరిస్థితి కాస్త ఆసక్తికరంగా మారింది. ఆమె నటించిన రెండు భారీ పాన్ ఇండియా చిత్రాలు కేవలం రెండు వారాల వ్యవధిలో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. సాయిపల్లవికి ఇది నటిగా మంచి అవకాశంగా కనిపిస్తున్నప్పటికీ, రెండు సినిమాల నిర్మాతలకు మాత్రం థియేటర్ల కేటాయింపు, ప్రచార కార్యక్రమాలు, ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించడం వంటి అంశాల్లో సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. రణబీర్ కపూర్ రాముడిగా, సాయిపల్లవి సీతాదేవిగా, యష్ రావణుడిగా నటిస్తున్న భారీ చిత్రం 'రామాయణ: పార్ట్ 1'. నితేష్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. భారతీయ ఇతిహాసం రామాయణం ఆధారంగా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో భారీగా విడుదల చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. నవంబర్ 6న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇందులో సాయిపల్లవి సీత పాత్రలో కనిపించనుండటంతో ఆమె పాత్రపై కూడా భారీ ఆసక్తి నెలకొంది. 'రామాయణ: పార్ట్ 1' విడుదలైన సరిగ్గా రెండు వారాల తర్వాత సాయిపల్లవి నటించిన మరో భారీ చిత్రం 'ఓం: చాప్టర్ 1 -- ఉదిరం' థియేటర్లలోకి రానుంది. ధనుష్ హీరోగా నటిస్తున్న ఈ సినిమాకు 'అమరన్' ఫేమ్ రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో మమ్ముట్టి, శ్రీలీల తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సాయిపల్లవి కూడా కథలో ప్రాధాన్యత ఉన్న పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. ఆమె పాత్రలో యాక్షన్, భావోద్వేగాలకు ప్రాధాన్యత ఉంటుందని ప్రచారం జరుగుతోంది. రెండు సినిమాల మధ్య కేవలం 14 రోజుల గ్యాప్ ఉండటంతో థియేటర్ల కేటాయింపు విషయంలో కొంత ప్రభావం పడే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. ముఖ్యంగా 'రామాయణ: పార్ట్ 1'కు భారీ స్పందన వచ్చి ఎక్కువ కాలం థియేటర్లలో కొనసాగితే, రెండు వారాల తర్వాత విడుదలయ్యే 'ఓం: చాప్టర్ 1 -- ఉదిరం'కు థియేటర్లు సర్దుబాటు చేయడం కొంత సవాలుగా మారవచ్చు.. అయితే ఈ రెండు సినిమాలు సాయిపల్లవికి ఒక విషయంలో ప్రత్యేకమైన అవకాశాన్ని ఇవ్వనున్నాయి.






'జైలర్ 2' కోసం తప్పుకున్న ధనుశ్.. 'ఓం చాప్టర్ 1' కొత్త విడుదల తేదీ ఖరారు!

కోలీవుడ్ స్టార్ హీరో ధనుశ్, లెజెండరీ నటుడు మమ్ముట్టి ప్రధాన పాత్రలలో నటిస్తున్న తాజా చిత్రం 'ఓం చాప్టర్ 1'. ఈ సినిమా విడుదల తేదీని తాజాగా ప్రకటించింది చిత్రయూనిట్. ఈ సినిమాను నవంబర్ 20, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ స్పష్టం చేశారు. ఈ చిత్రానికి రాజ్‌కుమార్ పెరిసామి దర్శకత్వం వహిస్తున్నారు. ముందుగా అనుకున్న ప్రకారం ఈ సినిమా అక్టోబర్ 16న ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉంది. అయితే సూపర్ స్టార్ రజినీకాంత్ నటించిన భారీ బడ్జెట్ చిత్రం 'జైలర్ 2' అక్టోబర్ 15న విడుదలవుతుండటంతో, రజినీకాంత్ పై ఉన్న అపారమైన గౌరవంతో ధనుశ్ ఈ సినిమా విడుదల తేదీని వాయిదా వేస్తున్నట్లు గతంలోనే ప్రకటించారు. రూ. 600 కోట్లకు పైగా వసూళు సాధించిన 'జైలర్' చిత్రానికి సీక్వెల్‌గా వస్తున్న 'జైలర్ 2'తో బాక్సాఫీస్ వద్ద పెద్ద ఎత్తున క్లాష్ ఏర్పడకుండా ఉండేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చిత్ర బృందం తెలిపింది. రజినీకాంత్ సినిమాతో పాటు, దీపావళి బరిలో నిలవాలని భావించిన హిందీ చిత్రం 'రామాయణ పార్ట్ వన్' మరియు సూర్య నటిస్తున్న 'సీన్' సినిమాలతో కూడా ఎలాంటి పోటీ లేకుండా ఉండేందుకే ఈ నవంబర్ తేదీని లాక్ చేసినట్లు వెల్లడించారు. పరిశ్రమలో పెద్ద సినిమాలు ఒకరి నిర్ణయాలను మరొకరు గౌరవించుకోవాలని, పరస్పర అవగాహనతో ముందుకు వెళ్లాలని ధనుశ్ అభిప్రాయపడ్డారు. రాజ్‌కుమార్ పెరిసామి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో సాయి పల్లవి, శ్రీలీల, నసీరుద్దీన్ షా తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాకు సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తుండగా, ఎజిల్ అరసు కె. సినిమాటోగ్రఫీ, ఆర్. కలైవనన్ ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. శ్రద్ధా అగర్వాల్, ధనుశ్, అజ్మత్ జగ్మగ్ సంయుక్తంగా వండర్ బార్ ఫిల్మ్స్, ఆర్ టేక్ స్టూడియోస్ పతాకాలపై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

అల్లు అర్జున్ 'రాకా'లో ఐశ్వర్య లక్ష్మి లేదా .. క్లారిటీ ఇచ్చిన హీరోయిన్

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ ప్రాజెక్ట్ 'రాకా'పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. అల్లు అర్జున్ కెరీర్‌లోనే అత్యంత భారీ స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమాను అంతర్జాతీయ స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకునేలా తెరకెక్కిస్తున్నట్లు చిత్రబృందం చెబుతోంది. దీంతో సినిమా కథ, నటీనటులు, సాంకేతిక నిపుణులకు సంబంధించిన ప్రతి అప్‌డేట్‌పై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా ఈ సినిమాలో అల్లు అర్జున్ సరసన పలువురు ప్రముఖ కథానాయికలు కనిపించనున్నారనే వార్తలు కొంతకాలంగా వినిపిస్తున్నాయి. దీపికా పదుకొణె, రష్మిక మందన్న, మృణాల్ ఠాకూర్ వంటి పేర్లు ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌తో ముడిపడి ప్రచారంలో ఉన్నాయి. ఈ క్రమంలో మరో హీరోయిన్ పేరు కూడా తెరపైకి వచ్చింది. మలయాళంతో పాటు తెలుగు, తమిళ సినిమాల్లోనూ గుర్తింపు తెచ్చుకున్న ఐశ్వర్య లక్ష్మి 'రాకా'లో నటించబోతున్నారంటూ ఇటీవల సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. ఈ వార్త అభిమానుల్లోనూ ఆసక్తిని పెంచింది.అయితే తాజాగా ఈ ప్రచారంపై ఐశ్వర్య లక్ష్మి స్వయంగా స్పందించింది. తాను 'రాకా' సినిమాలో భాగం కాదని ఆమె స్పష్టం చేసింది. అంతేకాదు, తనను ఎవరైనా ఈ సినిమాలో చేర్చాలని సరదాగా స్పందించడం ఆసక్తికరంగా మారింది. దీంతో ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం ఐశ్వర్య లక్ష్మి 'రాకా' తారాగణంలో లేరని భావించవచ్చు. అయితే సినిమా విడుదలకు ఇంకా సమయం ఉండటంతో భవిష్యత్తులో తారాగణానికి సంబంధించి మరిన్ని అధికారిక ప్రకటనలు వచ్చే అవకాశం ఉంది. అల్లు అర్జున్, అట్లీ కలయికలో వస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. అట్లీ గతంలో భారీ కమర్షియల్ అంశాలతో సినిమాలను తెరకెక్కించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఇప్పుడు అల్లు అర్జున్‌తో కలిసి చేస్తున్న ఈ ప్రాజెక్ట్‌ను మరింత భారీ స్థాయిలో రూపొందిస్తున్నట్లు సమాచారం. సినిమాలో పలువురు ప్రముఖ నటీనటులు భాగం కానున్నారనే ప్రచారం సాగుతోంది. ముఖ్యంగా కథకు అనుగుణంగా ఒకటి కంటే ఎక్కువ కీలక మహిళా పాత్రలు ఉండనున్నాయని, వాటి కోసం స్టార్ హీరోయిన్లను తీసుకుంటున్నారని టాక్ వినిపిస్తోంది. అయితే పూర్తి తారాగణంపై చిత్రబృందం అధికారికంగా ప్రకటించే వరకు ప్రచారంలో ఉన్న పేర్లను నిర్ధారించలేం.'రాకా' సినిమాకు సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తున్నారు.



ఆ నీచులను ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టను: ఎన్టీఆర్ వార్నింగ్



గత కొన్ని గంటలుగా సోషల్ మీడియాలో 'చుట్టమల్లే'(దేవర సినిమా) పాట తెగ వైరల్ అవుతుంది. ఏఐ ద్వారా అత్యంత నీచంగా ఎడిట్ చేసిన ఈ వీడియోని కొంతమంది సోషల్ మీడియాలో షేర్ చేస్తూ పైశాచిక ఆనందం పొందుతున్నారు. అలాంటివారిపై హీరో ఎన్టీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఏఐ ద్వారా ఎడిట్ చేసిన ఆ వీడియోని షేర్ చేసిన వారిపై లీగల్ యాక్షన్ తీసుకుంటామని హెచ్చరించాడు. ఒక ఆడపిల్లను అత్యంత అవమానకరంగా చూపేందుకు ఏఐని ఉపయోగించడం సిగ్గు చేటు అని.. ఎట్టిపరిస్థితుల్లోనూ వారిని వదిలిపెట్టబోనని హెచ్చరించాడు. ఈ మేరకు ఎక్స్‌లో సుధీర్ఘమైన పోస్ట్ పెట్టాడు.

'మహిళలను తల్లులుగా, దేవతలుగా గౌరవించే దేశంలో.. 'మాతృదేవోభవ' అనేది కేవలం ఒక మాట మాత్రమే కాదు, మన సంస్కృతిలో భాగం. అలాంటి సమాజంలో కొందరు ఇంత దిగజారి.. ఒక మహిళను అత్యంత అవమానకరంగా చూపించేందుకు ఏఐ (ూ×) సాంకేతికతను దుర్వినియోగం చేయడం తీవ్రంగా ఖండించాల్సిన విషయం. ఇలాంటి దారుణమైన మార్ఫింగ్ వీడియోను రూపొందించేందుకు ఏఐని ఉపయోగించడం సిగ్గుచేటు. 'చుట్టమల్లే' వీడియోను మార్ఫింగ్ చేసి, అసభ్యకరంగా రూపొందించిన ఆ నీచులను ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టను. ఈ వీడియోను రూపొందించిన వారితో పాటు దాన్ని సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్న వారిపై కూడా అన్ని రకాల చట్టపరమైన చర్యలు తీసుకుంటాను. దయచేసి ఇలాంటి కంటెంట్‌ను ఎవరూ చూడొద్దు.. షేర్ చేయొద్దు.. ఎంగేజ్ అవ్వొద్దు అని విజ్ఞప్తి చేస్తున్నాను. ఈరోజు బాధితురాలు మరొకరు కావచ్చు.. రేపు అది మీ తల్లి, సోదరి, భార్య లేదా కుమార్తె కావచ్చు. ఇది చాలా తీవ్రమైన సమస్య. ఏఐ సాంకేతికత దుర్వినియోగాన్ని అరికట్టేందుకు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు కేంద్రం కూడా కఠినంగా వ్యవహరించాలని, పటిష్ఠమైన నిబంధనలు తీసుకురావాలని కోరుతున్నాను' అని ఎన్టీఆర్ ట్వీట్ చేశాడు.

PRINTED AND PUBLISHED BY MUPPIRISETTY JAGADEESH, On behalf of CATERWEALTH MEDIA LLP, PRINTED at M/S. SREE SESHASAI ENTERPRISES, D.NO. NEW. 3-88, OLD. 3-22, GOSALA, CHANDRA THEATER ROAD, PENAMALURU-521151, KRISHNA DISTRICT, ANDHRA PRADESH, PUBLISHED AT CATERWEALTH MEDIA LLP, 3RD FLOOR, 59-12-9A, FIRST LINE, GAYATHRI NAGAR, VIJAYAWADA, NTR DISTRICT, ANDHRA PRADESH. EDITOR: MUPPIRISETTY JAGADEESH. RNI REGD NO. APTEL/2016/70247, Email I D : mahanagarap@gmail.com Phone : 9044417999